# మాఘపౌర్ణమినాడు జరిగిన శ్రీ సద్గురు పాదపూజా దృశ్యములు





పెదనింద్రకొలను శాఖలో



శ్రీ కాళీవనాశ్రమంలో

# సమర్థ సద్గురు

## ఆధ్యాత్మిక మాసపత్రిక

**శ్రీకాళీగార్డెన్స్ ఆశ్రమం - 522508, గుంటూరు జిల్లా**

ఫోన్ (0863) 2293645, 2293862, 2293206.

web : www.mathaji-babuji.org samardhasadguru@rediffmail.com



**సంపాదక వర్గము**

మిస్. పి. ఇందిరాదేవి

డా॥ యమ్. స్వర్ణముఖి

సి.వి. రమణ బాబు

పి.యస్.ఆర్.కె. ప్రసాద్

కె. మురళీ మోహన వర్మ



సంపుటి 41 సంచిక 8
పేజీలు 44
ఏప్రియల్ 2022

5సం॥ల చందా రూ. 250
2సం॥ల చందా రూ. 120
సంవత్సర చందా రూ. 60
విడిప్రతి వెల...... రూ. 5

బ్యాంక్ డ్రాఫ్ట్ Y.S.C.K.P.M చారిటబుల్ ట్రస్ట్ , A/C సమర్థ సద్గురు ,పేరుతో డ్రా చేయండి.
M.O, బ్యాంక్ డ్రాఫ్ట్ పంపవలసిన చిరునామా
మేనేజరు
సమర్థ సద్గురు మాగజైన్
శ్రీకాళీగార్డెన్స్ - 522508, నంబూరు
గుంటూరు జిల్లా

Printed and published by C.V. Ramana Babu on behalf of YOGINI SRI CHANDRA KALI PRASADA MATHAJI CHARITABLE TRUST and Printed at Samardha Sadguru Publications, D.No. 3-499, Sri Kali Gardens Ashram, Nambur - 522508, Guntur Dist., Andhra Pradesh and Published at D.No. 3-499, Sri Kali Gardens Ashram, Nambur - 522508, Guntur Dist., Andhra Pradesh, Editor PALURI SIVA RAMA KALI PRASAD


**ఈ సంచికలో ............................ ....... పేజీ**


దాశరథీ శతకము ............................ ..........4
శ్రీబాబూజీ ఉవాచ........................................ 5
అమ్మమాట.................................... ............ 7
అగస్త్య హృదయం ....................... .............9
మనసు - మాయ........................... .............11
శివ కేశవుల అభేద తత్వం .......................13
ప్రాప్తం - ప్రారబ్ధం ........................................15
సర్వం కృష్ణార్పణం ........................................17
విశ్వాసం ..........................................................19
ధ్యానం ..........................................................21
మానవ జన్మ మళ్ళీ రాదు .......................25
కైవల్యోపనిషత్ ... ........................................27
శుభకృత్ .................. ......................................29
శ్రీకాళీగార్డెన్స్ కార్యక్రమాలు ....................31
శ్రీ ప్రకాశానంద స్వామి .............................32
నిరీక్షణ .............................. ..............................35
సమర్థ సద్గురునాధుని దివ్యచరిత్ర.....37
సత్సంగం .................. ...................................... 39
విష్ణు కథలు ...... ........................... ...................41

## దాశరథీ శతకము - భద్రాచల రామదాసు

21) కంటి నదీతటంబుబొడగంటి భద్రనగాధిపవాసమున్
గంటి నిలాతనూజనురు కార్ముక మార్గణశంఖచక్రముల్
గంటిని మిమ్ము లక్ష్మణుని గంటి కృతార్థుడ నైతి నో జగ
త్కంటక దైత్యనిర్దళన దాశరథీ కరుణాపయోనిధీ!




భావం - ఏటి దరిని భద్రాచలమునందు ఉండుట చూశాను, సీతను చూశాను, గొప్పవైన ధనువును, బాణములను, శంఖచక్రములను చూశాను, లోక కంటకులైన దానవులను సంహరించిన మిమ్ము, లక్ష్మణుని చూసి కృతార్థుడనయ్యాను దాశరథీ కరుణాపయోనిధీ!

*వార్తాలాపం రచించినది ఎవరు?
*కృష్ణుడికి మకుటం ఎందుకు లేదు?
*బయట పారవేసినప్పుడు విస్తరాకు ఎందుకు సంతోషపడుతుంది?
*భగవంతుడు గుడిసె ఎందుకు కాల్చాడు?
*బ్రాహ్మణుడు తనకు గోహత్యాపాతకం అంటదని ఎందుకు అన్నాడు?
*తన దారిలో వున్న డబ్బుల మూటను దక్కించుకోలేనివాడెవడు?
*బాబూజీ తమ ఫోటో ఎందుకు తీయనిచ్చేవారు కాదు?
*చీకటికి ఆధారమేది?
*పాండురంగడి ఆభరణాలు ఎలా అదృశ్యమయ్యాయి?
*ఎప్పుడు నీ ఆత్మలో సకల భూతములను దర్శించగలుగుతావు?

*సమాధానాలు లోపలి పేజీలలో ............................*

# శ్రీ బాబూజీ ఉవాచ

- కీ.శే. పరాశర ప్రసాద్

26-1-1981

ఉదయం రామాలయంలో శ్రీ బాబూజీ వ్యాహ్యాళికి వచ్చారు. శ్రీబాబూజీ వాకింగ్‌చేస్తూ "హే దయామయా! అని పాడుకుందామా? లేకపోతే గురుధ్యానం చేసుకుందామా?"



అని అడిగారు. మేమంతా మౌనంగా వున్నాము.''ముందు గురుధ్యానం చేసుకుందాం" అన్నారు శ్రీ బాబు. 'ఓం గురుర్బ్రహ్మే'..... అని గురుప్రార్థన చేసుకున్న తర్వాత 'ఓం శ్రీనాధా గురుమహారాజా' అని పాడటం మొదలుపెట్టాం.

''ఓం శ్రీనాధా......ఆహా! అంటే మంగళ స్వరూపా! నాధా, మమనాధా! అట్టి మంగళ స్వరూపుడైన మహారాజా! నమస్కారము.

ఓం అనేది ప్రణవం అకార, ఉకార, మకారములు దానిలో వున్నాయి. సర్వజగత్తుకి అదే ఆధారం. అది శక్తిబీజం. అనంతశక్తి అందులోనే ఇమిడి ఉంది. ఓం శ్రీనాధా గురుమహారాజా అనేసరికి మంత్రం అయింది. అది మహామంత్రం. అట్టి గొప్పమంత్రం మనం నామం చేసుకుంటే మనలోని కలుషం అంతా హరించిపోతుంది. ఆ నామం చాలు తరించటానికి. ఇందులో ఇంతలోతైన అర్థం ఉంది. నీనుండే సర్వజగత్తు వచ్చింది సర్వజగత్తు నీలోనే ఉంది. నీవే సత్యస్వరూపుడవు.

'ఆత్మానందా! గురుమహారాజా!' అంటే అది మామూలు ఆనందంకాదు. శాశ్వతమైన ఆనందం. అట్టి ఆనంద స్వరూపుడైన మహారాజునకు నమస్కారము. ఆయన మహారాజులకు మహారాజు. ఆయన మకుటంలేని కిరీటధారియైన మహారాజు.

ఈ రాజులంతా క్షత్రియులం అని మీసం మెలేస్తారు. మేము ఈ రాజ్యాలకి మహారాజులం అంటారు. ఆ రోజుల్లో వారంతా

మహాజ్ఞానుల సాంగత్యం ఉన్నప్పటికి, అజ్ఞానమనే చీకటిలో ఉన్నారు.

గుడ్లగూబ చీకటి గుహలో ఉంటుంది. మనం కూడా అలాంటి చీకటి గుహలోనే ఉన్నాము. గుడ్లగూబ గుహలోనికి లైటువేస్తే చీకటి పోతుంది. కాని అజ్ఞానమనే చీకటిపోదు. దీనిని తొలగించేవాడే గురుమహారాజు. 'గు' అంటే అజ్ఞానాంధకారము. 'రు' అంటే దానిని హరించి వెలుగుని, ప్రకాశాన్ని ఇచ్చేవాడు. దుర్యోధనాదులు శ్రీకృష్ణ పరమాత్ముని చూసి వీడేమి మహారాజు? మకుటం లేదు, అని మీసాలు మెలేశారు. ఈయనకి మకుటం ఏమిటి? మకుటాలన్నిటికి మకుటం ఆయన. మకుటాలన్నిటిని ప్రకాశింపచేసే స్వరూపుడాయన. ఆయనకు మకుటం వీళ్ళుపెట్టగలరా? తీసివేయగలరా?" అన్నారు శ్రీ బాబు.

'పరమానంద స్వరూపా! గురుమహారాజా!' అంటే మామూలు ఆనందంకాదు. ఇహంలో భోగభాగ్యాలుకాదు. అది నిరతిశయమైన ఆనందం. సకల జీవకోటికి చైతన్యాన్నిచ్చే ఆనందం అది. ఆ చైతన్యమే తప్పుకుంటే ఏమవుతుంది? తద్దివిటదివిట, ఏడుకట్ల సవారి" అన్నారు.

తర్వాత 'హే దయామయా' అని పాడాము. "ఈపాట ఎప్పుడు పాడినా సరైన స్థాయిలో పాడాలి. ఎంతో ఆర్తితో పాడాలి" అన్నారు శ్రీ బాబు. 'ఆప్ హీ' అన్నాడు. 'ఆప్' అని వదిలివేయలేదు, అంటే ఓ దయామయా 'నువ్వే' ఈ సంసార సుఖదుఃఖాలనుండి రక్షించే ఆధారం. నీవుతప్ప ఇంకెవ్వరూ లేరు. నన్ను రక్షించే వారెవ్వరూ లేరు. 'మాతాపితా భగవాన్' అని పాడేటపుడు 'ఆహా!' అన్నారు.

చూశారా! ఎంత ప్రశాంతంగా ఉందో, నిన్న ఎంత చీదరగా వుందో, పిల్లల ఏడ్పులు అవీనూ, నిన్న వచ్చినవాళ్ళ మనసులో సంకల్పాలు నాకు తెలుస్తాయి. మీకు తెలియదు. ఇక్కడ కాసేపయినా ప్రశాంతంగా ఉండనివ్వరు. ఇక్కడ సంకీర్తన చేసుకుంటూ ఏవేవో భావాలతో వుంటారు. అది నాకు తెలుసు. మీకు తెలియదు. కొంచెంసేపైనా భగవంతుని స్మరించుకోకపోతే ఎందుకు?" ఆ తర్వాత 'ఎదురైనారా ఎవరైనా' అని పాడమన్నారు. వాకింగ్ పూర్తి అయిన తర్వాత ప్రార్థన చేసి వచ్చేశాము.

# అమ్మ మాట

- జపమాలా ప్రసాద

***మూర్తిలోని అమూర్త్యత్త్వాన్ని గ్రహించాలి***

సాధకుడైనటువంటివాడు ప్రథమ దశలో ఏదో ఒక దేవతా మూర్తిని ఆశ్రయించి, ఉపాసన చేయగా చేయగా, ఆ మూర్తిలోని అమూర్త్యత్త్వాన్ని దర్శించాలి. అదే అస్మద్గురుదేవులైన శ్రీబాబూజీ మహరాజ్‌వారు చెప్పేవారు 'గురుదేవుని యొక్క సగుణ రూపంలో దాగివున్న నిర్గుణ తత్త్వాన్ని దర్శించాలి' అని. ఇక్కడ గురు దేవునికి, నీవారాధించే దేవతా మూర్తికి భేదం లేదు. అది నీవు గ్రహించిన నాడే నీవు తత్త్వతః తెలుసుకోగలుగుతావు. నీవు నమ్మిన దైవము (గురుదేవుని) యందు సకల దేవతలను దర్శించాలి. సకల దేవతలలోనూ నీ ఇష్టదైవాన్ని గుర్తించాలి. అది జరిగిన నాడు **సర్వ భూతస్థమాత్మానం। సర్వభూతాని చాత్మని।** అన్న భగవద్గీతా వాక్యం కూడా నీకు అనుభవానికి వస్తుంది. అంటే సర్వ భూతములను నీ ఆత్మనందు, నీ ఆత్మను సకల భూతములందు దర్శించగలుగుతావు.



కనుక నీవు ఆరాధించే దేవుడిని (గురుదేవుని) కేవలం ఆ విగ్రహం లేక రూపం వరకే పరిమితం చేయకండి. విగ్రహారాధనతో ఆగవద్దు. ఆ విగ్రహంలోని అనంత శక్తిని దర్శించాలి. అది జరిగిననాడు నీ గురుదేవుడు నీలో నిద్రాణమైవున్న మనసును లేపి, ఆ అనంత శక్తి నీలోనే వున్నది, అని దానిని గుర్తింపజేస్తారు.

'రాధా మాధవులు ఇద్దరా? ఒక్కరా?' అని అడిగారు గురుదేవులు ఒకసారి. మళ్ళీ దానికి జవాబు చెప్పగలిగే సమర్థులు వారే కాబట్టి, ఈ విధంగా చెప్పారు...'భాగవతంలో ఎక్కడా కూడా రాధ మనకు ఒక వ్యక్తిగా కనబడదు. అయినా కూడా, గోపికల యొక్క సమష్టి హృదయమే రాధ. రాధాకృష్ణులు ఏక స్వరూపులు. కృష్ణుడు పరమాత్మ (పురుషుడు) అయితే రాధ ఆయన ప్రకృతి (శుద్ధ మాయా స్వరూపిణి).

కృష్ణుడు భగవంతుడు, రాధ ఆయన శక్తి. కృష్ణుడు లేకపోతే రాధకి వునికే లేదు. బ్రహ్మవైవర్త పురాణంలో రాధను గురించి చెప్పబడింది. కనుక రాధ అనేది ఒక వ్యక్తి మాత్రం కానే కాదు.

రాధాకృష్ణులు పొదరిళ్ళలో విహరిస్తూ, రాసకేళి జరిపారని జయదేవ మహాకవి వర్ణిస్తే, దానికి పెడర్థాలు తీసే ప్రబుద్ధులకి ఏం తెలుసు రాధామాధవ తత్వం? ఈ ప్రపంచం అనేదే ఒక పొదరిల్లు. అది 'నేను-నాది' అనే తీగలచేత దట్టంగా అల్లుకొనబడి వుంది. దానిలోకి జీవులు వెళ్ళి ఇరుక్కుపోతున్న సమయంలో భగవంతుడు 'ఒరేయ్! మీరు ఆ నేను - నాది అనే అహంకార మమకారములతో కూడిన ప్రపంచంలో బంధింపబడిపోతున్నారు. నేను మీలోనే వున్నాను. నీవు జీవుడవు; నేను పరమాత్మను. నీవు ప్రకృతివి; నేను పురుషుడను, నీవు జీవాత్మ, నేను పరమాత్మ.

నేను (ఆత్మ) లేకపోతే నీవు లేవు, ఈ సృష్టి లేదు. కనుక ఈ ప్రకృతి, పరమాత్మల మధ్య రాసకేళి నిరంతరమూ జరుగుతూనే వుంటుంది. ఆత్మరతే రతి. ఆత్మానందమే ఆనందము. ఇదే రాధా మాధవ కేళి. ఇది గుర్తించినవాడు కనుకనే భద్రాచల రామదాసువారు 'అంతా రామమయం, ఈ జగమంతా రామమయం. అంతరంగమున ఆత్మారాముడు అనంతరూపమున వింతలు సలుపగ అంతారామ మయం - అని పాడుకున్నారు.

కనుక మీలోనే వున్న శక్తిని, పరమాత్మని గుర్తించండి. అదే జీవబ్రహ్మైక్యం. అటువంటి సాధన చేయడానికి తగిన సాధన సంపదను, అఖండ భక్తి జ్ఞాన వైరాగ్యాలను ప్రసాదించి సర్వదా గురుపాదుకలు కాపాడు గాక! సుఖీభవ! సుఖీభవ!!

# అగస్త్య హృదయం

(గత సంచిక తరువాయి) - వారణాసి కాళీ ప్రసాద్ U.S.A

**నమః పూర్వాయ గిరయే పశ్చిమే గిరయే నమః**

**జ్యోతిర్గణానాం పతయే దినాధిపతయే నమః ॥**

తాత్పర్యము - పూర్వ, పశ్చిమ గిరులయందు విలసిల్లే ఆదిత్యుడా! నీకు నమస్కారము. జ్యోతిర్గణములకు, దినమునకు అధిపతియైన ఓ భాస్కరా! నీకు నమస్కారము.

ఈ శ్లోకం ద్వారా అగస్త్యులు తూర్పు కొండలలో ఉదయిస్తూ, పడమటి కొండలలో అస్తమిస్తున్న సూర్యుడిని వర్ణిస్తూనే, పరస్పర విరుద్ధములైన ఆ దిక్కులకు అతీతమైన ప్రకాశమును గురు ప్రకాశముగా గుర్తించాలని తెలియజేస్తున్నారు. శాస్త్రీయపరంగా పరిశీలించినా భూభ్రమణము వలన దానిపై నివశించే మనందరికీ ఉదయాస్తమానములు వుంటాయి కానీ సూర్యుడికి అవి వుండవు కదా! అదే విధముగా బహిర్ముఖముగా పరివర్తన చెందుతున్న ప్రపంచంలో వుంటూనే, దానికి ఆధారమై, మార్పు చెందని పరమాత్మను కేవలం అంతర్ముఖంగా మాత్రమే గుర్తించవచ్చునన్న సందేశం ఇందులో దాగి వున్నది. ఈ ప్రస్తావనతో ఉదయం మరియు సాయం సంధ్యలో ప్రకాశించే సూర్యుడినే కాక ఆ రెండు సమయముల మధ్య ప్రయాణిస్తూ వ్యాపిస్తున్న వ్యోమనాధుని రూపమును గుర్తించాలి. అదే కాలాతీతమైన దినమునకు అధిపతి **దినాధిపతయే నమః** యైన గురుపరమాత్మకు ప్రతిరూపము.

శ్రీబాబూజీ మహరాజ్ చీకటికి (అజ్ఞానమునకు) కూడా వెలుగే (జ్ఞానమే) ఆధారమనీ ఆ వెలుగు లేకపోవడమే చీకటి అని శలవిచ్చారు. ఆ ప్రకారం అస్తమయము నుండీ తదుపరి ఉదయం వరకు వున్న చీకటికి కూడా సూర్యుని వెలుగే ఆధారమని గ్రహించాలి. ఆధ్యాత్మికతలో ద్వంద్వములు ఎక్కడ కనిపించినా సాధకుడు ఆ రెండింటి యందూ సమదృష్టిని కలిగి వుంటూనే వాటికి అతీతముగా వుండాలన్నది గురుదేవుల బోధ యొక్క సారాంశము. గీతాచార్యులు **తుల్యనిందాస్తుతిః; శీతోష్ణ సుఖదుఃఖేషు సమః** వంటి ప్రస్తావనలతో పలుమార్లు ఈ విషయం

వివరిస్తారు. అంతేకాక, సమాసములలో నేను ద్వంద్వ సమాసమును అంటూ ఆయన సమదృష్టిని బోధిస్తారు.

**జ్యోతిర్గణానాం పతయే** అంటూ జ్యోతిర్గణములన్నిటికీ పతియైన పరంజ్యోతి స్వరూపమును అగస్త్యులు ఆవిష్కరిస్తున్నారు. **జ్యోతిషాం రవిరంశుమాన్** అని గీతాచార్యులు ప్రకటించినది కూడా అదే కదా! తన సద్గురుదేవులనే ఆ పరమపురుష పరంజ్యోతి స్వరూపముగా సాధకుడు దర్శించగలగాలి. **ఓం పరంజ్యోతిషే నమః** అని శ్రీ గురుదేవులను స్తుతించే నామం వెనుక భావము అదే!

**దినాధిపతయే నమః** అనే సంబోధనతో అగస్త్యులు గురుభగవానుని కాలరూపులుగా మరియు తమస్సుని తొలగించే జ్ఞాన స్వరూపులుగా వర్ణిస్తున్నారు.

శ్రీబాబూజీ ఆదేశించినట్లు నిరంతర సాధనా సత్సంగములతో సమయమును నిత్యకాలములో జమ చేసుకోవడమే సాధకులైన మనందరమూ గురుదేవులను దినాధిపతిగా గుర్తించడమన్న అంతరార్థమును అగస్త్యులు ఈ శ్లోకం ద్వారా వివరిస్తున్నారు.

- సశేషం



# మనసు - మాయ

- వేలమూరి రవికుమార్

పూర్వము ఇక్ష్వాకు వంశంలో లవణ మహారాజు వుండేవాడు. ఆయన ఒకనాడు నిండు సభలో కొలువుదీరి వుండగా, ఒక ఇంద్రజాలికుడు వచ్చాడు. తన ప్రదర్శనకు రాజుగారి అనుమతి కోరాడు. రాజుగారు సరే అన్నాడు. ఇంతలో మాళవదేశపు సామంతరాజు లవణ మహారాజుకు బహుమతిగా అత్యంత సుందరమైన, బలిష్ఠమైన పంచకళ్యాణి గుఱ్ఱాన్ని పంపించాడు. ఆ గుఱ్ఱాన్ని చూసిన ప్రతి ఒక్కరూ కూడా అబ్బా! ఆ గుఱ్ఱం తమ వద్ద వుంటే బాగుండు ఒక్కసారైనా దాన్ని స్వారీ చేయాలి అని ఆశపడసాగారు. ఇంతలో ఇంద్రజాలికుడు తనతో తెచ్చిన నెమలి ఈకల విసనకఱ్ఱతో రాజుగారి ముందు నాలుగుసార్లు అటూఇటూ ఊపాడు. వెంటనే రాజుగారికి తను కూడా స్వారీ చేయాలనుకున్న విధంగానే వెంటనే ఆ గుఱ్ఱంపై ఎక్కి వేటకి బయలుదేరాడు. వేట చాలాసేపు సాగింది. రాజుగారు అలసిపోయారు. విపరీతమైన దాహం వేసింది. ఆ గుఱ్ఱం కూడా అలసిపోయినందువలన మెల్లగా నడవటం ప్రారంభించింది. అలా ముందుకు సాగుతుండగా, ఒక ఊడల మఱ్ఱి చెట్టు వచ్చింది. ఆ చెట్టు తీగలు రాజుగారి పీకకు బిగుసుకున్నాయి. తనపై బరువు తగ్గటంతో ఆ గుఱ్ఱం వెంటనే రివ్వున అడవిలోకి దూసుకెళ్ళింది.

ఊడలు గొంతుకు బిగుసుకున్న రాజుగారు ఊపిరాడక గిలగిల కొట్టుకుంటున్నారు. ఆయన బరువుకు తీగలు తెగి క్రిందపడి మూర్ఛపోయాడు. ఆయనకు స్పృహ వచ్చేసరికి చీకటిపడిపోయింది. దానితో రాజుగారు దగ్గరలో వున్న చెట్టు తొఱ్ఱలో దూరి ఆ రాత్రంతా గడిపారు. తెల్లవారింది. రాజుగారికి మెలకువ వచ్చింది. దాహం తగ్గింది. కానీ విపరీతమైన ఆకలి, నీరసం ప్రారంభమయింది. ఇంతలో దూరంగా ఒక బోయ స్త్రీ బుట్టలో ఏదో పెట్టుకుని తింటూ కనిపించింది. అది గమనించిన రాజుగారు ఆమె వద్దకు వెళ్ళి తనకు కొంచెం పెట్టమని, లేకపోతే ఆకలితో తన ప్రాణం పోయేటట్లుగా వున్నదని ప్రార్థించాడు. కాని ఆ అమ్మాయి పరుగెత్తింది. రాజుగారు ఆ అమ్మాయి ముందుకు వెళ్ళి పెట్టమని అర్థించాడు. ఆమెకు రాజుగారి ఖరీదైన దుస్తులు, ఆభరణాలు, వేషం చూసి ఆయనపై మోజు ఏర్పడింది. ఆమె రాజు గారితో నేను బోయదానిని, నేను నీకు నచ్చుతానా? అని ప్రశ్నించి ముందుకు

పరుగెత్తింది. రాజుగారికి ఆమె మనస్సు అర్థం అయింది. ఆయనకు ఆకలి దహించివేస్తోంది. వెంటనే 'నీవు ఏం చేయమంటే అది చేస్తాను, కానీ ముందు నువ్వు నాకు ఆహారం పెట్టి నన్ను బ్రతికించు' అన్నాడు. దానికి అంగీకరించి ఆ అమ్మాయి తన ఆహారంలో సగం తీసి రాజుకు పెట్టి, మిగిలిన సగం కొండ దగ్గర పని చేస్తున్న తన తండ్రికి అని చెప్పింది. రాజుగారు ఆ ఆహారం తిని, ఆమెతో కలసి, ఆమె తండ్రి దగ్గరకు వెళ్ళాడు. తండ్రి ఆహారం తిన్నాక, తన కూతురి మనోగతం తెలుసుకున్నాడు.

లవణ మహారాజును బోయగూడెం తీసుకువెళ్ళారు. ఆ గూడెం పచ్చిమాంసం తిని, నెత్తురు త్రాగే బోయలది. ఆమె తండ్రి బోయగూడెం పెద్దలకు ఈ విషయం చెప్పాడు. రాజుగారు ఆ ప్రాంతం అంతా పరిశీలించాడు. అక్కడ అంతా ఈగలు, రక్తం వాసన, ఎముకలు అతి భయంకరంగా ఉంది. కాని రాజుగారికి కూడా యౌవనంలో వున్న ఈ బోయ స్త్రీపైన మనసు పోవడంతో ఇవేవీ పెద్దగా పట్టించుకోలేదు.

బోయ పెద్దలంతా పెద్దగా కొమ్ము బూరాలు ఊదుతూ, తప్పెటలు వాయిస్తూ, వారిద్దరికీ వివాహం జరిపించారు. ఈ కార్యక్రమం వరుసగా ఏడురోజులు జరిగింది. రాజుగారికి తన వంటిమీద రాజదుస్తులు ఎప్పుడు పోయి, తనకు కూడా ఆ చిన్న దుస్తులు ఎప్పుడు వచ్చాయో కూడా గుర్తింపు లేకుండా పోయింది. తరువాత మామగారింట్లో కాపురం పెట్టాడు. పిల్లాజల్లలతో కాపురం పెరిగింది. మామగారు అల్లుడిని నేను పోషించలేను వేరే కాపురం పెట్టుకోమని ఇంట్లో నుండి పంపివేశాడు.

లవణ మహారాజు బోయ గూడెంలో ఒక ఇల్లు నిర్మించుకుని, తన భార్యా బిడ్డలతో వేరు కాపురం పెట్టాడు. తాను సంపాదించి తెచ్చిన ఆహారం వారికి సరిపోయేది కాదు. దానితో భార్యాభర్తలిద్దరూ తరచుగా తగవులాడుకునేవారు. మధ్య మధ్యలో విడిపోతూ తిరిగి కలుసుకుంటూ వుండేవారు. తన స్నేహితుడి ఇంట్లో తలదాచుకుని, మళ్ళా తిరిగి భార్యతో సంధి కుదర్చుకుని తన ఇంటికి వచ్చేవాడు. ఇలా చాలాసార్లు జరిగింది. భార్య, బిడ్డలు ఎంతటి దుర్భాషలాడినా కూడా, వారికి సరిగా ఆహారం పెట్టలేకపోయినందుకు బాధపడి తనను తాను నిందించుకుని, మరలా వారితో సంసారం సాగించేవాడు.

- సశేషం

# శివ కేశవుల అభేద తత్వం

- రావి శోభ

శివ కేశవులకు అభేదమని చెప్పే ఎన్నో సంఘటనలను కథలుగా విన్నాము. వారిద్దరినీ ఒకేసారి స్తుతిస్తూ చెప్పే పద్యం మాత్రం వారిరద్దరి అభేదరూపాన్ని చూపిస్తోంది.

**గవీశ పాత్రో నగజార్తి హరీ। కుమార తాతః శశిఖండ మౌళి।**

**లంకేశ సంపూజిత పాదపద్మః। పాయంద నాదిః పరమేశ్వరోనః॥**

**గవాం** + **ఈశః** = గవీశః అంటే ఆవులకు ప్రభువు అయిన వృషభం. దానిని వాహనంగా కలవాడు సదాశివుడు. **నగజ** అంటే పార్వతీదేవి. **నగజార్తి హరీ** అంటే పార్వతిదేవి బాధని తొలగించినవాడు - శంకరుడు.

**తాతః** అంటే సంస్కృతంలో తండ్రి అని అర్థం.

**కుమార తాతః** అంటే కుమారస్వామికి తండ్రి - సాంబశివుడు.

**శశిఖండ మౌళి** అంటే చంద్రుని శిరస్సుపై ధరించినవాడు - భోలా శంకరుడు.

**లంకేశ సంపూజిత పాదపద్మః** అంటే లంకేశ్వరునిచే చక్కగా పూజింపబడిన వాడు - కైలాస నాథుడు.

**అనాదిః** అంటే ఆదిమధ్యాన్త రహితుడు అయిన శంకరుడు.

**పరమేశ్వరః నః పాయాత్** అంటే పరంజ్యోతి స్వరూపుడైన ఆ పరమేశ్వరుడు మనలను సర్వదా కాపాడు గాక! అని అర్థం.

**తాత్పర్యం** - వృషభం వాహనంగా కలవాడు, పార్వతి దేవి బాధను తొలగించినవాడు, కుమారస్వామికి తండ్రియైన వాడు, చంద్రుని తన శిరస్సుపై ధరించినవాడు, లంకేశ్వరునిచే పూజింపబడినవాడు, ఆదిమధ్యాన్త రహితుడు అయిన ఆ పరంజ్యోతి స్వరూపుడైన ఆ పరమేశ్వరుడు మనలను సర్వదా కాపాడుగాక! అని అర్థం.

ఇలా చదివితే ఈ పద్యం శివయ్యను స్తుతిస్తూ వున్నది కదా! మరి ఆ మహావిష్ణువును కూడా ఎలా చదివితే స్తుతించవచ్చో చూద్దాం!

**(ప) రమేశ్వరుడు** అంటే లక్ష్మీపతి విష్ణువు. **వీశపాత్రః** 'వి' అంటే పక్షి అని అర్థం. **వీనామ్ ఈశః** అంటే పక్షులకు రాజు గరుత్మంతుడు.

**(న) గజార్తి హరీ** అంటే గజేంద్రునికి మోక్షమిచ్చినవాడు నారాయణుడు.

**(కు) మారుడు** అంటే మన్మథుడు.

**(కు) మార తాతః** అంటే మన్మథునికి తండ్రి మహావిష్ణువు.

**(శ) శిఖండమౌళి** అంటే నెమలి పింఛము ధరించినవాడు శ్రీకృష్ణుడు.
**(లం) కేశ సంపూజిత పాదపద్మః** - క అంటే బ్రహ్మ, **ఈశః** అంటే రుద్రుడు అనగా బ్రహ్మరుద్రాదుల చేత విశేషంగా పూజింపబడేవాడు మహావిష్ణువు. ఆ......(ప) రమేశ్వరుడు మనలను కాపాడు గాక! అని అర్థం.
**తాత్పర్యం** - పక్షులకు రాజైన గరుత్మంతుడిని వాహనంగా గల నారాయణ మూర్తి, గజేంద్రునికి మోక్షం ఇచ్చినవాడు, మన్మథునికి తండ్రి, నెమలి పింఛమును తలపై ధరించేవాడు, బ్రహ్మ రుద్రాదులచే విశేషంగా పూజింపబడేవాడు అయిన ఆ ...మహావిష్ణువు మనలను కాపాడుగాక! అని అర్థం.

కాబట్టి పైన చెప్పిన పద్యాన్ని మొదటి అక్షరాన్ని తీసివేసి చదివితే మహావిష్ణువుని ప్రార్థించవచ్చు.

## పెదనిండ్రకొలను శాఖలో కార్యక్రమాలు

*** ప్రతి గురువారము అన్నార్తులకు, సాధువులకు అన్నదానం జరుగును***

**ఏప్రియల్ 2022**
2 శని - శ్రీ శుభకృత్ నామ సంవత్సర ఉగాది - శ్రీసద్గురుపాదపూజ
10 ఆది - శ్రీరామ నవమి - శ్రీ సద్గురు పాదపూజ
16 శని - చైత్ర పూర్ణిమ - శ్రీసద్గురు పాదపూజ.
25 సోమ - శ్రీ గురుదశమి - శ్రీసద్గురు పాదపూజ.
**మే 2022**
6 శుక్ర - శ్రీ శంకర జయంతి - శ్రీ సద్గురు పాదపూజ
16 సోమ - (వైశాఖ) గురుపూర్ణిమ - శ్రీ సద్గురు పాదపూజ
25 బుధ - శ్రీ గురుదశమి; హనుమజ్జయంతి - సత్సంగం, శ్రీసద్గురు పాదపూజ

## ప్రాప్తం-ప్రారబ్ధం

- ఎన్. కుట్టీ

పాపయ్య ఆ ఊరిలో పెద్ద ఆసామి. ధనవంతుడు కానీ పరమ లోభి. పిల్లికి బిచ్చం పెట్టడు. పరమేశ్వరుడు పాపయ్యకు బుద్ధి చెప్పాలి అనుకున్నాడు. పాపయ్యకు ఎంత వున్నా, ఇంకా ఇంకా కావాలని కోరుకునేవాడు. ఒకసారి పరమేశ్వరుడు ఒక డబ్బు మూటను రోడ్డు మీద పడవేసి ఏం జరుగుతుందోనని చూస్తూ వున్నాడు.

ఒక గ్రుడ్డివాడు ఆ దారి వెంబడే వెడుతూ ఆ మూటను చూడకుండా నడుచుకుంటూ తన వైపే వస్తున్న ఆ గ్రుడ్డివాణ్ణి చూసి పాపయ్య తన చేతిలో వున్న పెద్ద మొత్తాన్ని ఇవ్వడానికి మనస్సు ఒప్పక, తన సంచీలో వున్న ఒక పైస తీసి, ఆ గ్రుడ్డివానితో 'నీ అదృష్టం కొద్దీ నీకీ ధనం దొరికింది అని చెప్పి ఎక్కడి నుంచి వస్తున్నావు?' అని అడిగాడు.

అప్పుడు ఆ గ్రుడ్డివాడు పాపయ్యతో 'అయ్యా! నేను చాలా దూరం నుండి వస్తున్నాను' అన్నాడు. పాపయ్య అతనితో 'నువ్వు గ్రుడ్డివాడవు కదా, మరి అంత దూరం నుండి ఎలా రాగలుగుతున్నావు?' అని అడిగాడు. దానికి సమాధానంగా 'నాకు తెలియదు బాబయ్యా! అదంతా ఆ భగవంతుడి దయ!' అన్నాడు గ్రుడ్డివాడు.

వెంటనే పాపయ్య తనలో తాను 'ఆ గ్రుడ్డివాడు అంత దూరం నుండి ఎవరి సహాయం లేకుండా నడచి వచ్చాడు కదా, నేను ఎవరి సహాయం లేకుండా ఇక్కడి నుండి ఆ కనబడే చెట్టువరకు కళ్ళు మూసుకుని వెళ్ళలేనా? తప్పకుండా నడవగలను' అనుకుని, ఆ చెట్టు దాకా కళ్ళు మూసుకుని నడిచాడు. అందువల్ల అతనికి దారిలో వున్న డబ్బుల మూట ప్రక్క నుండి నడిచినా కూడా ఆ మూట అతనికి కనబడలేదు. అలా నడుచుకుంటూ చెట్టు దాకా వెళ్ళేసరికి ఆ చెట్టు దగ్గరే వున్న పరమేశ్వరుడు పాపయ్యకు ప్రత్యక్షం అయ్యాడు.

పరమేశ్వర సాక్షాత్కారం అయ్యేసరికి పాపయ్య ఆనందానికి అవధులు లేవు. పాపయ్య తనలో తాను 'నేను ఏ జన్మలో ఏం పుణ్యం చేసుకొన్నానో, అందుకే నాకు మహేశ్వరుడు దర్శనమిచ్చాడు' అనుకొని సంతోషించి, భగవంతుడికి ప్రణమిల్లాడు.

అప్పుడు పరమేశ్వరుడు పాపయ్యతో 'ఓ పాపయ్యా! నీవు వచ్చే దారిలో ఒక డబ్బుల మూట నీ కోసమే పడవేశాను. అది తీసుకున్నావా?'

అని అడిగాడు. దానికి పాపయ్య 'నేను వచ్చేటప్పుడు ఒక గ్రుడ్డివాడు ఎదురయ్యాడు, వాడు నడవగా లేనిది నేను ఎందుకు నడవలేను అని కళ్ళు మూసుకుని వచ్చాను అందువల్ల నాకు ఆ మూట కనబడలేదు' అన్నాడు దిగులుగా.

పరమేశ్వరుడు 'పాపయ్యా! నీ అదృష్టం కొద్దీ ఆ మూట అక్కడే వున్నది. శ్రీఘ్రంగా వెళ్ళి ఆ మూట తెచ్చుకో' అని చెప్పగానే, పాపయ్య గంపెడు ఆశతో డబ్బుమూట దగ్గరకు చేరేలోపల ఒక పెద్ద గుఱ్ఱం మీద ఎక్కి వెడుతున్న ఒక ఆసామి తన చేతిలోని కఱ్ఱతో ఆ మూటను అందుకుని తీసుకుని వెళ్ళిపోయాడు. పాపం! పాపయ్య ఆశతో పరుగెడుతూ అది నా మూట నా మూట అంటూ పరుగెత్తి అలసి సొలసి ప్రయోజనం లేక తిరిగి వెనక్కి పరమేశ్వరుని దగ్గరకు వచ్చాడు.

'ఏం పాపయ్యా! డబ్బు మూట దొరికినదా?' అని అడిగాడు పరమేశ్వరుడు. అప్పుడు పాపయ్య 'లేదు స్వామీ! నేను ఆ డబ్బు మూటను చేరుకుంటుండగా, ఒకతను గుఱ్ఱం మీద ఎక్కి వచ్చి కఱ్ఱతో దాన్ని తీసుకుని పోయాడు. అప్పటికీ నేను అది నాది నాది అని ఎంత అరచినా కూడా అతను వినిపించుకోకుండా వెళ్ళిపోయాడు. ఇదంతా నా ప్రారబ్ధం. డబ్బు పోయిందని నాకు చాలా దుఃఖంగా వుంది స్వామీ!' అని ఏడ్చాడు.

అప్పుడు మహేశ్వరుడు 'పాపయ్యా! బాధ పడకు. అది నీ డబ్బు కాదు. ఆ డబ్బు ఆ గుఱ్ఱం మీద ఎక్కిన వాడికే చెందాలని వుంది. అందుకే అది నీకు దక్కకుండా పోయింది. దానినే **ప్రాప్తం** అంటారు' అన్నాడు.

అప్పుడు పాపయ్య పరమేశ్వరుడితో 'స్వామీ! అది ప్రాప్తం కాదు. అది **అతని ప్రాప్తం - నా ప్రారబ్ధం**' అని, 'స్వామీ! ఇందాక మీరు ఆ డబ్బు నాది, నా కోసమే అక్కడ పారవేశాను అన్నారు కదా. మరి అది నాచేతికే ఇవ్వవచ్చు కదా. అలా కాకుండా అలా అనవసరంగా రోడ్డు మీద పడవేసి నన్ను తీసుకోమంటమెందుకు?' అని అడిగాడు.

'భగవంతుడు చెప్పినా ఒక్కొక్కసారి ప్రాప్తం లేనప్పుడు అది దొరకదు. **బుద్ధి కర్మానుసారిణి** అంటారు. నీకు ప్రాప్తం లేనప్పుడు అది నీ చేతిలో పెట్టినా కూడా నీకు దక్కదు. దానిని ఇంకెవరైనా కొట్టుకుపోవచ్చు. దానినే **ప్రాప్తం - ప్రారబ్ధం** అంటారు' అన్నాడు ఈశ్వరుడు పాపయ్యతో.

# సర్వం కృష్ణార్పణం

- సుషమ్నా ప్రసాద

పూర్వం ఒక బ్రాహ్మణుడుండేవాడు. అతను ఏ పని చేసినా 'సర్వం కృష్ణార్పణం!' అని అనేవాడు. కొంతకాలానికి అతనిలో అహంకారం పొడచూపింది. మంచి, చెడు అనే భేదం లేకుండా ఏ పని చేసినా కృష్ణ పరమాత్మయే బాధ్యుడని, తాను ఫలాపేక్ష రహితుడనని అహం భావం విజృంభించింది.

ఒకరోజు పొలంలో పండిన ధాన్యమంతా తెచ్చి ఇంటిముందు పరచి ఎండబెట్టాడు. ఇలా వుండగా ఒక రోజు ఒక గోవు ఆ దారినపోతూ, ధాన్యమంతా చిందరవందర చేసింది. అదే సమయానికి వచ్చిన ఆ బ్రాహ్మణుడు తీవ్రంగా ఆగ్రహించి, వెనుకా ముందు చూడకుండా ఆ గోవును చితకబాదాడు. ఆ తీవ్ర గాయాలకు తట్టుకోలేక ఆ గోవు వెంటనే మరణించింది. వెంటనే ఆ బ్రాహ్మణుడు అతి తెలివితేటలతో ఆ కార్యమునకు శ్రీకృష్ణపరమాత్మదే బాధ్యత అని, తనకే పాపము అంటదని అక్కడ ఆ దృశ్యాన్ని చూసిన ప్రేక్షకులకు చెప్పాడు. 'నేను సర్వమూ కృష్ణార్పణము చేశాను కాబట్టి ఈ గోహత్యా పాతకము నాకు అంటదు' అని పలికాడు.

ఆ సమయంలో కృష్ణపరమాత్మ చెంతనే కూర్చుని సంభాషిస్తున్న రుక్మిణీదేవి 'స్వామీ! అతను చేసిన పాపమును మీకు అంటగడుతున్నాడేమిటి?' అని అడిగింది. కృష్ణుడు చిరునవ్వుతో 'దేవీ! నువ్వేమీ దిగులు పడకు. వానికి తగిన గుణపాఠం నేను నేర్పిస్తాను' అన్నాడు. తరువాత కొద్దిరోజులకు ఆ బ్రాహ్మణుడు తన బంధువులను పిలిచి సంతర్పణ చేయదలచాడు. ఆ సంతర్పణకు కృష్ణపరమాత్మ వృద్ధ బ్రాహ్మణ రూపంలో విందుకు వచ్చాడు. వస్తూనే అక్కడ దగ్గుతూ వుమ్మివేసి, భోజనశాల అంతా చిందరవందర చేశాడు. ఆ దృశ్యాన్ని చూసి వచ్చిన అతిథులంతా నివ్వెర పోయారు. ఆతిథ్యమిచ్చే ఆ బ్రాహ్మణుడు ఆగ్రహావేశాలకులోనై, ఆ క్రొత్త అతిథిని నిందించసాగాడు. 'నేనిచ్చే ఈ ఔదార్యమైన ఆతిథ్యానికి ఎందుకింత మూఢంగా ప్రవర్తిస్తున్నావు? నాకు ఇన్ని తలవంపులు తెచ్చావు?' అని మందలించాడు.

వెంటనే వృద్ధ బ్రాహ్మణ వేషంలో వున్న కృష్ణపరమాత్మ చిరునవ్వుతో 'ఏమిటి ఈ అతిథి సత్కారాలు చేస్తున్నది మీరా?' అన్నాడు. 'అవును నేనే! ఇంతమందికి ఆతిథ్యమిచ్చి, సంతృప్తి పరచడానికి ఎంత కష్టపడ్డానో తెలుసా? అని తిరిగి ప్రశ్నించాడా బ్రాహ్మణుడు. వెంటనే ఆ

వృద్ధ బ్రాహ్మణుడు అదే చిరునవ్వుతో, 'మీరు సర్వం కృష్ణార్పణం అంటూవుంటారు కదా! అలా త్రికరణశుద్ధిగా భావిస్తే, ఈ ఆతిథ్యానికి బాధ్యులు మీరెలా అవుతారు?' అని ప్రశ్నించాడు. వెంటనే ఆ బ్రాహ్మణుడు కోపంగా 'నేను ఇంత కష్టపడి విందుభోజనానికి మూలకారణమైతే, కృష్ణపరమాత్మ చేశాడంటావేమిటి?' అన్నాడు. వెంటనే ఆ వృద్ధ బ్రాహ్మణుడు 'హే విప్రోత్తమా! ఈ ఆతిథ్యానికి మీరే బాధ్యులని అహంకారపూరితంగా చెబుతున్నారు కదా! అలాంటప్పుడు గోహత్యా పాతకమునకు మీరు పాత్రులు కారా? శ్రీకృష్ణ పరమాత్మ ఎలా బాధ్యుడవుతాడు? ఫలాపేక్ష రహితంగా చేసేవాడు మంచిజరిగితే తాను బాధ్యుడనని, చెడు జరిగితే భగవన్నిర్ణయమని భావించడు. ఫలమును ఆశించకుండా ప్రతిపని భగవన్నిర్ణయమని, తాను నిమిత్తమాత్రుడనని భావించేవాడే నిజమైన 'కృష్ణార్పణం' చేసుకున్నవాడు. నిజమైన భక్తుడు సుఖదుఃఖాలకు అతీతంగా వుంటాడు. అంతేకానీ, నీలాగా వాచావేదాంతము వున్నవాడు తరించలేడు' అని గుణపాఠం నేర్పి ఆ బ్రాహ్మణుడు అదృశ్యమైపోయాడు.

## హైదరాబాదు శాఖలో కార్యక్రమాలు

**కార్యక్రమాలలో ఏమైనా మార్పులు వుంటే ఎప్పటికప్పుడు హైదరాబాద్‌శాఖవారి వాట్సప్ గ్రూప్‌లో తెలుపబడును......**

**ఏప్రియల్ 2022**

2 శని - శ్రీ శుభకృత్ నామ సంవత్సర ఉగాది. - శ్రీ సద్గురుపాదపూజ, సత్సంగం

10 ఆది - శ్రీరామ నవమి - శ్రీ సీతారాముల సామూహిక కళ్యాణమహోత్సవాలు, శ్రీసద్గురు పాదపూజ

16 శని - చైత్ర పూర్ణిమ - శ్రీ సద్గురుపాదపూజ, సత్సంగం.

25 సోమ - శ్రీగురుదశమి - శ్రీ సద్గురుపాదపూజ, సత్సంగం.

**మే 2022**

6 శుక్ర - శ్రీ శంకర జయంతి - సత్సంగం, శ్రీ సద్గురు పాదపూజ

16 సోమ - (వైశాఖ) గురుపూర్ణిమ - సత్సంగం, శ్రీ సద్గురు పాదపూజ

25 బుధ - శ్రీ గురుదశమి; హనుమజ్జయంతి - సత్సంగం, శ్రీసద్గురు పాదపూజ

## విశ్వాసం

సేకరణ - భీమవరం గుప్తా

ఒక ధనవంతుడు వుండేవాడు. ఒక సెలవు రోజున పడవ తీసుకుని సరదాగా సముద్రంలో ఒంటరిగా షికారుకి వెళ్ళాడు. అతను సముద్రంలో కొంచెం దూరం చేరుకున్నాక అకస్మాత్తుగా తీవ్రమైన తుఫాను వచ్చింది. దానితో అతని పడవ పూర్తిగా ధ్వంసమైపోవడంతో అతను సముద్రంలోకి దూకేశాడు. లైఫ్ జాకెట్ వుండటం వలన నీటిలో తేలుతూ, తుఫాను శాంతించిన తరువాత ఒక తీరానికి చేరుకున్నాడు. కానీ, ఆ ద్వీపంలో మనుషుల జాడ లేదు. చుట్టూ సముద్రం తప్ప ఏమీ కనిపించడం లేదు.

అప్పుడా వ్యక్తి 'నా జీవితంలో నేను ఎవరికీ చెడు చేయనప్పుడు నాకే ఎందుకిలా జరిగింది?' అని బాధ పడ్డాడు. ఆ తరువాత 'తనను మరణం నుంచి రక్షించిన భగవంతుడు తీరం చేరుకునేందుకు కూడా దారి చూపిస్తాడని' మనసులో దేవుణ్ణి గట్టిగా విశ్వసించాడు.

ఆ ద్వీపంలోనే ఒంటరిగా నివసిస్తూ అక్కడ పండే ఆకులు, పండ్లు తింటూ బ్రతకడం అలవాటు చేసుకున్నాడు. కొంతకాలం తరువాత నెమ్మదిగా అతనిలోని ఆశలు నీరుగా మారిపోవడం మొదలైంది. కానీ, దేవుడిపట్ల అతని విశ్వాసం మాత్రం తగ్గించుకోలేదు. దానితో అతని జీవితమంతా ఈ దీవిలో గడపక తప్పదని నిర్ణయించుకుని ఆ ద్వీపంలో తాను నివసించేందుకు ఓ గుడిసె నిర్మించుకోవడం ప్రారంభించాడు.

గుడిసె నిర్మాణం పూర్తి అవగానే మళ్ళీ అకస్మాత్తుగా ఉరుములు, మెరుపులతో వాతావరణం మారిపోయింది. అతని గుడిసెపై పిడుగు పడి, గుడిసె కాలిపోసాగింది. ఇదంతా చూసి విస్తుపోయిన ఆ వ్యక్తి ఆకాశం వైపు చూస్తూ 'ప్రభూ! ఎంతవరకు ఇది న్యాయం? ఎన్ని కష్టాలు ఎదురైనా నీపై ఎప్పుడూ విశ్వాసం కోల్పోలేదు. నిన్నే నమ్ముకున్నాను. నువ్వెందుకు నాపై దయ చూపడం లేదు?' అని నిరాశనిస్పృహలలో కూరుకు పోయి ఏడవసాగాడు.

అంతలో అకస్మాత్తుగా ఒక పడవ ఆ ద్వీపం సమీపంలోకి వచ్చింది. పడవలో నుండి ఇద్దరు వ్యక్తులు దిగి వచ్చి మిమ్మల్ని

రక్షించేందుకు వచ్చామని చెప్పారు. కాలిపోతున్న గుడిసె దూరం నుండి మాకు కనబడింది. ఈ నిర్జన ద్వీపంలో ఎవరో ఇబ్బంది పడుతున్నట్లు అనిపించింది. మీ గుడిసె కాలి వుండకపోతే మీరు ఇక్కడ వున్నట్లు మాకు తెలిసేది కాదు అన్నారు. అప్పుడు ఆ వ్యక్తి కళ్ళలో నీళ్ళు కారుతుండగా ఆ భగవంతుని క్షమార్పణ కోరుకుని 'ఓ ప్రభూ! నన్ను రక్షించడానికి నువ్వే పిడుగు రూపంలో నా గుడిసెను తగలబెట్టావని నేను గ్రహించ లేకపోయాను. నువ్వు నా సహనాన్ని పరీక్షించావు. కానీ, నేను అందులో నిలబడలేకపోయాను. నువ్వు మాత్రం నిశ్చయంగా నిన్ను నమ్మినవారిని రక్షించి తీరతావని నిన్ను నువ్వు నిరూపించుకున్నావు. దయచేసి నన్ను క్షమించు ప్రభూ!' అని మనసులోనే నమస్కరించాడు.

సుఖంలోనైనా, దుఃఖంలోనైనా తనను నమ్మినవారితో దేవుడు ఎప్పుడూ వుంటాడు. సహనం కోల్పోయినప్పుడు మనిషికి ఒక్కొక్కసారి దేవుడిమీద కోపం వస్తుంది. కానీ, మనిషిపై దేవుడు ఎప్పుడూ కోపం తెచ్చుకోడు. ఆయన ఎల్లప్పుడూ మంచినే చేస్తాడు. జీవితంలో అప్పుడప్పుడు ఇలాంటి పరిస్థితులు ఎదురు అవుతాయి. మనం నిరాశతో దేవుడు, లేదా విధిపై కోపం తెచ్చుకుంటాము. విశ్వాసాన్ని కోల్పోతాము. దాని కారణంగా మన ఆత్మ విశ్వాసం కూడా క్షీణించిపోయే అవకాశముంటుంది. కానీ, ఆ తరువాత మనకు నెమ్మదిగా అర్థమవుతుంది ఆ దేవుడు చేసింది మన మంచికే అని, లేకపోతే నేను ఈ రోజు ఇలా ఉండేవాణ్ణి కాదు అని.

కాబట్టి ఎన్ని కష్టాలు ఎదురైనా, దుఃఖం ఎంత కృంగదీసినా, కరోనా కాటువేయాలని చూసినా, సమస్యలు తొక్కివేయాలని చూసినా ఎన్నడూ ఆత్మ విశ్వాసాన్ని వీడకుండా భగవంతునిపై భారముంచి పట్టుదలతో మన పని మనం చేసుకుంటూ వెళితే తప్పకుండా విజయం సాధించి తీరుతాం!


ధ్యానం
మధుప
ఏమండీ! ఇవాళ అల్లుడుగారు వస్తున్నారు. మర్చిపోకుండా స్టేషనుకు వెళ్ళండి.
అలాగే!
1
సరే పద!
సార్! ఇవాళ రైలులో మినిస్టర్ గారు వస్తున్నారు. మనం వెళ్ళాలి.
2


అల్లుడుగారూ! ప్రయాణం బాగా జరిగిందా? నాకు వేరే పని ఉంది. మీరు మన పనివాడితో ఇంటికి వెళ్ళండి.
3
అల్లుడుగారు సరిగ్గా ఇంటికి చేరారో లేదో!
నమస్తే సార్! మీ ప్రయాణం బాగా జరిగిందా?
4


ప్రియమైన మిత్రులారా! ఈరోజు ...........
అల్లుడుగారు ఈపాటికి స్నానం చేసుంటారు
5
అల్లుడుగారు భోజనం సరిగ్గా చేశారో లేదో!
మీ కార్యక్రమం చాలా అద్భుతంగా జరిగింది సార్! మరి ఇక నేను ఉంటాను.
6


క్షమించండి అల్లుడుగారూ! ఇవాళే నాకు మినిస్టర్ ప్రోగ్రామ్ కూడా వచ్చింది. మిమ్మల్ని సరిగ్గా చూసుకోలేకపోయాను.
7


ఆ పోలీసు ఆఫీసరును గమనించారా? తన వృత్తి ధర్మం ప్రకారం అతను ఏ పని చేస్తున్నా మనస్సు మాత్రం తన అల్లుడుగారి మర్యాదల మీదే నిలిచి ఉంది. అలా మీరు ఏ పని చేస్తున్నా మనస్సు సదా భగవంతుని పై నిలిపి ఉంచడమే ధ్యానం అంటే.
8

# మానవ జన్మ మళ్ళీ రాదు

సేకరణ - కె. రాఘవరాజు

**పునర్విత్తం పునర్మిత్రం పునర్భార్య పునర్మహి**

**ఏతత్సర్వం పునర్లభ్యం న శరీరం పునః పునః**

పోయిన ధనం మళ్ళీ చేరుతుంది. దూరమైన మిత్రుడు మళ్ళీ చేరువవుతాడు. భార్య గతిస్తే మరో భార్య లభిస్తుంది. భూసంపద మళ్ళీ ప్రాప్తిస్తుంది. పోయినవన్నీ తిరిగి మళ్ళీ రాబట్టుకోవచ్చు! కానీ మానవ శరీరం మాత్రం మళ్ళీ మళ్ళీ రాదు. అందుకే **శరీరం ఖలు ధర్మ సాధనం** అన్నారు.

కేవలం శరీరం వుంటేనే ధార్మిక పనులు చేయవచ్చు. శరీరం వుంటేనే నాలుగు మంచి పనులు చేసే అవకాశం వస్తుంది. శరీరం వుంటేనే హితవాక్యాలు చెప్పవచ్చు. ఏ పని చేయడానికైనా ఈ శరీరం కావాలి. కనుక శరీరాన్ని రక్షించుకోవలసినది మానవ జన్మ ఎత్తిన వాళ్ళే.

జంతువులకు శరీరం వుంటుంది. కానీ వాటికి ఆలోచన వుండదు. పైగా ఆలోచన కలిగినా దాన్ని అమలు చేయడానికి శరీరం సహకరించదు. బుద్ధి, ఆలోచన, మాట్లాడే శక్తి, కావలసినది సంపాదించుకునే జ్ఞానం, తగిన అవయవ నిర్మాణం వుండేది ఒక్క మానవునికే! వాటిని అమలు చేసే నైపుణ్యం కూడా మానవుడికే వుంటుంది. కనుక మనం అందరం మన శరీరాలను కాపాడుకోవాలి.

అతిగా తిన్నా, అతిగా ఆలోచించినా, అతిగా సుఖం కలిగించినా, అతిగా దుఃఖం కలిగించినా, ఏదైనా సరే అతిగా చేస్తే ఈ శరీరం కాస్తా పుటుక్కుమంటుంది. ఇక ఈ శరీరం చేజారిపోయిన తరువాత మనం చేయగలిగినదేమీ వుండదు. కనుక ముందు మనం ఈ శరీరాన్ని జాగ్రత్తగా చూసుకోవాలి. దీనికి కావలసినవి సత్యం, ధర్మం, శాంతి, ప్రేమ, అహింసలను పాటించడమే మహా ఔషధంగా పనిచేస్తుంది.

విస్తరాకుని ఎంతో శుభ్రంగా వుంచుకుని, నీటితో కడిగి, నమస్కారం చేసుకుని మరీ భోజనానికి కూర్చుంటాము. భోజనం పూర్తి అయ్యేవరకు ఆకుకు మట్టి అంటకుండా జాగ్రత్త వహిస్తాము. తిన్న మరుక్షణమే ఆ విస్తరి ఆకును మడిచి దూరంగా పడేసి వస్తాము. ఎంగిలి

ఆకును కూడా ముట్టుకోము. మనిషి జీవితం కూడా అంతే! మనలోని ఊపిరి పోగానే బయటపాడేసి వస్తారు. విస్తరి ఆకు బయట పారేసినప్పుడు అది సంతోషపడుతుంది ఎందుకంటే, పోయే ముందు ఒకరి ఆకలిని తీర్చడానికి నేను ఉపయోగ పడ్డాను కదా అన్న తృప్తి ఆ ఆకుకు వుంటుంది.

ఆ విస్తరాకుకు వున్న ముందు ఆలోచన భగవంతుడు మనుషులకు కూడా ఇవ్వాలని భగవంతుణ్ణి ప్రార్థిస్తూ! సేవ చేసే అవకాశం వచ్చినప్పుడు సేవ చేసుకోండి. జారవిడుచుకోకండి. మళ్ళీ ఇంకోసారి ఎప్పుడో చేయవచ్చులే అనుకుని వాయిదా వేయకండి. ఆ అవకాశము మళ్ళీ వస్తుందని అనుకుంటే, కుండ (శరీరం) ఎప్పుడైనా పగిలి పోవచ్చు, అప్పుడు ఆ విస్తరాకుకు వున్న తృప్తి మనకు వుండదు.

ఎంత సంపాదించి ఏమి లాభం? ఒక్క పైసా కూడా తీసుకు పోగలమా? మన చేత ప్రత్యక్షంగానో, పరోక్షంగానో ఓ పదిమందికి మంచి జరిగితే మన మానవ జన్మ సార్థకమయినట్లే!



# కైవల్యోపనిషత్

(గత సంచిక తరువాయి)

- రేఖ

ఇదే విషయం గురించి గురుగీత (3/324) చెబుతోంది.....

**యస్యాంతం నాదిమధ్యం, నహి కరచరణం**
**నామగోత్రం, న సూత్రం, నోజాతిర్నైవ వర్ణో**
**న భవతి పురుషో, నో నపుంసో, నచస్త్రీ**
**నాకారం, నోవికారం, నహి జన మరణం,**
**నాస్తి పుణ్యం, నపాపం**
**నోతత్వం, తత్వమేకం సహజ సమరసం**
**సద్గురుస్తం నమామి.**

సద్గురుదేవుడు ఈ రూపనామ క్రియాదులకు మాత్రమే పరిమితమైనవాడా? మనని అనుగ్రహించడానికి వచ్చిన ప్రసన్నమైన గురురూపం అనామంగానో, అరూపంగానో వుంటే, మనం గుర్తించలేమని ఒక రూపం దాల్చి వచ్చారు. **ఉపాసకానాం కార్యార్థం బ్రహ్మణో రూప కల్పన** అని శాస్త్రం చెబుతోంది. మన ఉపాసనని ముందుకు తీసుకు వెళ్లడానికి సర్వవ్యాపకమైన ఆ పరబ్రహ్మమే ఒక రూపం కల్పించుకుని, మనలను అనుగ్రహించడానికి వస్తారు. ఇదే విషయాన్ని భగవద్గీత (4/6) లో శ్రీకృష్ణ పరమాత్మ చెబుతాడు ..............

**అజోపి సన్నవ్యయాత్మా భూతానామీశ్వరోపి సన్**
**ప్రకృతిం స్వామధిష్ఠాయ సంభవామ్యాత్మ మాయయా**

పంచ మహాభూతాలను సృష్టించింది భగవంతుడే, ఒక్క అవ్యక్త శక్తియే. కానీ, జగద్గురువు శ్రీకృష్ణావతారంలో కావాలంటే, మనలను అనుగ్రహించడానికి, పంచభూతాలను ఆయనే అనుగ్రహించి, మనకోసం ఒక రూపం ధరించి అవతరించానని శ్రీకృష్ణ పరమాత్మయే చెప్పాడు.

అలా పైన చెప్పిన గురుగీత మంత్రం ఏం చెబుతోందంటే, ఎవరికి ఆది మధ్యాంతములు లేవో, కరచరణాలు లేవో, జాతి వర్ణములు లేవో, పురుషుడు, స్త్రీ, మరియు నపుంసకుడు కూడా కాదో, ఆకార వికారాలూ లేవో అదే గురుతత్వం. ఆకారం వుంటే వికారం వుంటుంది. ఇలాంటి వున్న గురువుగారి దగ్గరకు వెళ్లి మనం 'ఏమిటి స్వామీ! ఇలా

చిక్కిపోయారు!' అని భౌతిక లక్షణాలు, వికారాలు ఆ పరబ్రహ్మ వస్తువుకు ఆపాదించి మాట్లాడతాం. లేకపోతే వారికి ఏదో మామిడి పండు రసం తీసుకు వచ్చాను స్వీకరించండి అంటాం. కానీ వారు వీటికి లొంగేటటువంటి వారు కాదు. మనం చిన్నవాళ్లం కాబట్టి, పామరత్వంతో వుంటాం కాబట్టి, వారు మనం తెచ్చినవి స్వీకరించి, అనుగ్రహించినట్లుగా వుంటారు. దీనికంతటికీ ఆవల వున్నది గురుశక్తి. ఈ నామరూపాలను చూసి మనవలెనే వున్నారు అనుకుని భ్రాంతిలో వుంటాం. ఈ రకంగా చూడటం అలవాటయిపోయి, గురుదేవా! మీరు కూడా మా లాగా శీతోష్ణాలకీ, రాగద్వేషాలకు, సుఖదుఃఖాలకూ స్పందిస్తారు అనీ, ఇష్టాయిష్టాలు వుంటాయనీ అనుకుంటూ వుంటాము.

మానవత్వంలో వున్న మర్యాదలు, లక్షణాలతో వారి సన్నిధానంలో ప్రవర్తిస్తాం, మాట్లాడుతాం. దాని పర్యవసానం ఏమిటంటే ఒక పెద్ద షాక్ కొట్టినట్లుగా వుంటుంది గురుదేవుల మందలింపు. అది ఈ మామూలు కరెంటు, విద్యుచ్ఛక్తి కంటే ఎన్నో రెట్లు ఎక్కువగా వుంటుంది ఆ షాక్ అది చిచ్ఛక్తి కాబట్టి. ఈ విషయం అనుభవంతో చెబుతున్నాను గురు సన్నిధిలో ఎంత జాగ్రత్తగా మాట్లాడాలో, ఎలా ప్రవర్తించాలో తెలుసుకున్నాను అన్నారు మాతాజీ.

భగవద్గీత సాంఖ్యయోగం (2/29)లో............

**ఆశ్చర్యవత్పశ్యతి కశ్చిదేనమ్**
**ఆశ్చర్యవద్వదతి తథైవ చాన్యః**
**ఆశ్చర్యవచ్చైనమన్యః శృణోతి**
**శృత్వాప్యేనం వేద నచైవ కశ్చిత్ ॥**

- సశేషం

**ముఖ్య గమనిక**

మే నెలలో సంకల్పించిన శ్రీకాళీవనాశ్రమ స్వర్ణోత్సవ కార్యక్రమాలు ప్రస్తుత కరోనా పరిస్థితుల దృష్ట్యా నవంబర్ నెలకు మార్చబడినవి. మరిన్ని వివరాలు తరువాత తెలియజేయబడును.

## శుభకృత్

- పాలూరి కాళీప్రసాద్

ప్లవనామ సంవత్సరాన్ని దాటి శుభకృత్ నామ సంవత్సరంలోకి అడుగు పెడుతున్నాం. శుభం అంటే మంచి. శుభం అంటే మంగళకరం. శుభం అంటే అందమైనది, ప్రకాశవంతమైనది. అటువంటి శుభాలను కలిగించే సంవత్సరం అన్నమాట. నిజానికి కాలం పరమాత్మ స్వరూపమే. **కాలం కలయతామహం** - కదిలే వాటిలో కాలాన్ని నేను అని గీతాచార్యుడు చెప్పాడు. కనుక సంవత్సరాలన్నీ శుభప్రదమైనవే. అందుకే కొన్ని సంవత్సరాల పేర్లు ఎంత భయంకరంగా ఉన్నా వాటిముందు మనం శ్రీ అని తప్పనిసరిగా చేరుస్తాము.

నిరంతరం కదులుతూ ఉండేది కాలం. నీటి ప్రవాహాన్ని అయినా ఆనకట్టతో ఆపవచ్చేమో కానీ కాల ప్రవాహాన్ని ఆపలేము. ప్రవహించ కుండా స్థిరంగా ఉన్న నీరు త్వరగా పాడైపోతుంది. దానిలో అనేక సూక్ష్మక్రిములు, చెత్త చెదారం చేరి కలుషితం అయిపోతుంది. అదే నిరంతరం ప్రవహించే నీటిలో చెత్త వేసినా అది స్వచ్ఛంగానే వుంటుంది. అలాగే మన జీవితం కూడా కాలంతో పాటు నిరంతరం మార్పు చెందుతూ ఉంటేనే అది ఎప్పటికప్పుడు తాజాగా, అందంగా, ప్రకాశవంతంగా ఉంటుంది. చలనం లేక నిలిచిపోయిన జీవితం నిస్సారంగా ఉంటుంది.

సాధారణంగా మన తెలుగు సినిమాల చివరిలో శుభమ్ అని చూపిస్తారు. అలాగే ఇంగ్లీషు వాళ్ళు కథలు చెప్పినప్పుడు చివరిలో They lived happily ever after అని చెబుతారు. కానీ మన జీవితంలో శుభ అశుభాలు, సుఖదుఃఖాలు రెండూ శాశ్వతంగా ఉండవని, ఒకటి తర్వాత ఒకటిగా మళ్ళీ మళ్ళీ వస్తూ ఉంటాయని మనందరికీ తెలిసిందే కదా! మరి శాశ్వతమైన శుభం ఏది? ఆత్మ ప్రకాశమే శాశ్వత ప్రకాశం. ఆత్మానందమే శాశ్వతానందం. ఆత్మ సుఖమే శాశ్వత సుఖం. అటువంటి ఆత్మజ్ఞానాన్ని పొందినప్పుడే నిజమైన శుభం కలుగుతుంది.

మనలో ద్వైత భావన ఉన్నంతవరకు ఏదో కావాలనే, పొందాలనే ఆరాటం, అది దక్కలేదని ఆక్రోశం, ఉన్నదేదో పోతుందని ఆవేదన తప్పవు. అసలు నేను ఎవరో తెలుసుకుంటే ఈ కనిపించేదంతా నేనే అని కూడా తెలుసుకుంటావు. అంతా నీవే అయినప్పుడు పొందవలసినది కానీ,

కోల్పోయేది కానీ ఏమీ ఉండదు. అప్పుడు ఇంక అక్కడ ఎటువంటి రాగద్వేషాలకు, సుఖదుఃఖాలకు తావు ఉండదు. అక్కడ అంతా శాంతి, ఆనందం, ప్రకాశం, శుభమే. ఎందరో మహానుభావులు అటువంటి ఆత్మజ్ఞానాన్ని పొంది వారిలోని కామక్రోధాది దుర్గుణాల స్థానంలో అహింస, సత్యం, శాంతి, దయ, ప్రేమ, ఐకమత్యం, మానవత్వం, సమతా భావన, సమానత్వం మొదలైన ఉత్కృష్ట గుణాలను అలవరచుకొని, తమ అతి సాధారణమైన నిరాడంబర జీవితంలోనే ఆయా గుణాలను తమ ప్రబోధాల ద్వారా, అంతకంటే ముఖ్యంగా ఆచరణ ద్వారా సర్వ జనావళికి పంచిపెట్టారు. అయితే వారి ఆచరణ మార్గాన్ని అనుసరించి ఆత్మజ్ఞానాన్ని పొందకుండా కేవలం వారిని అనుకరించడం ద్వారానో, లేదా వేల కోట్లు ఖర్చు పెట్టి వారి భారీ ప్రతిమలు నెలకొల్పడం ద్వారానో ఆయా సద్గుణాలను సాధించాలనుకుంటే అది అసాధ్యం.

అయితే మహాత్ములను అనుసరించడం కంటే వారిని అనుకరించడం, లేదా అర్చించటం చాలా తేలికైన పని. నిజానికి అహింసకు ప్రతిరూపమైన బుద్ధభగవానుడు విగ్రహారాధనను ఖండించాడు. కానీ ఈరోజు ప్రపంచంలో ఏమూలకు వెళ్ళినా ఆయన భారీ విగ్రహాలు మనకు దర్శనమిస్తాయి. అయితే ఆయన బోధనలను, నిర్దేశించిన మార్గాన్ని ఎంతమంది అనుసరిస్తున్నారు? ఆచరణలో పెడుతున్నారు? అలా పెడితే ఈనాడు ఇంతటి యుద్ధాలు, మారణహోమాలు, రక్తపాతం చూడవలసిన ఖర్మ ఎందుకు పడుతుంది.

శ్రీగురుదేవులు చాలా కాలం ఎవరినీ తమ ఫోటో తీయనిచ్చేవారు కాదు. “నీకు నా ఫోటో కావాలా? నేను కావాలా? ఫోటోనే కావాలంటే అది ఏ గోడమీదో, గూట్లోనో, పర్సులోనో మాత్రమే ఉంటుంది. అదే నన్ను నీ హృదయంలో పెట్టుకుంటే ఇక నీకు నాకు భేదం కానీ, దూరం కానీ ఎక్కడ ఉంటుంది?” అనేవారు. అలా మహాత్ములను, గురువులను నిజంగా హృదయంలో ప్రతిష్ఠించుకుని వారు చూపిన మార్గంలో పయనిస్తే జీవితమంతా శుభాలమయమే. ప్రతి సంవత్సరమూ శుభకృత్ సంవత్సరమే. అటువంటి నిజమైన సాధకుడు తన జీవితాన్ని పండించుకోవటమే కాక సర్వ మానవాళికి శుభకరుడై వెలుగొందుతాడు.

# శ్రీ కాళీగార్డెన్స్ ఆశ్రమ కార్యక్రమాలు

**ఏప్రియల్ 2022**

2 శని - శ్రీ శుభకృత్ నామ సంవత్సర ఉగాది - ఉదయం 10గం. పంచాంగ శ్రవణం, శ్రీ సద్గురుపాదపూజ, భక్తసమారాధన

3 ఆది నుండి 9 శని వరకు - మౌన ధ్యాన సాధన సప్తాహ శిబిరం

10 ఆది - శ్రీరామ నవమి - తె॥ 5-30ని॥లకు శ్రీ సద్గురుపాదపూజ, ఉదయం 11గం. శ్రీసీతారాముల సామూహిక కళ్యాణ మహోత్సవము, భక్తసమారాధన.

16 శని - చైత్ర పూర్ణిమ - శ్రీసద్గురుపాదపూజ

25 సోమ - శ్రీ గురుదశమి - సత్సంగం, శ్రీ సద్గురుపాదపూజ

29 శుక్ర - మాస శివరాత్రి

30 శని - అమావాస్య

**మే 2022**

3 మంగళ - అక్షయ తృతీయ - శ్రీసద్గురుపాదపూజ, భక్తసమారాధన

6 శుక్ర - శ్రీ శంకరజయంతి - శ్రీబాబు బృందావనమూర్తి ప్రతిష్ఠా 27వ వార్షికోత్సవం. సత్సంగం, శ్రీసద్గురుపాదపూజ, భక్తసమారాధన.

14 శని - శనిత్రయోదశి

16 సోమ - వైశాఖ గురుపూర్ణిమ - సత్సంగం, శ్రీసద్గురుపాదపూజ, భక్తసమారాధన

20 శుక్ర - వైశాఖ బహుళపంచమి - శ్రీమహాకాళికాపరమేశ్వరీ సమేత శ్రీ రామలింగేశ్వరస్వామివారల ప్రతిష్ఠా వార్షికోత్సవం. రాత్రి 7గం.లకు సామూహిక లీలా కళ్యాణ మహోత్సవం.

25 బుధ - శ్రీ గురుదశమి; హనుమజ్జయంతి - సత్సంగం, శ్రీసద్గురు పాదపూజ

28 - శని - మాస శివరాత్రి, శనిత్రయోదశి

30 - సోమ - అమావాస్య

31 - మంగళ - ఆశ్రమ వ్యవస్థాపక దినోత్సవం - సత్సంగం, శ్రీ సద్గురు పాదపూజ

# శ్రీ ప్రకాశానంద స్వామి

సేకరణ - మురళీ

(గత సంచిక తరువాయి)

శ్రీ ప్రకాశానంద స్వామి వారు దయా స్వరూపులు. సర్వ ప్రాణులయందు సమభావము కలిగి ఉండెడివారు. ప్రజలకు ఏవైనా ఇబ్బందులుగాని, నష్టములుగాని ఎవరైనా కలుగచేస్తే చాలా బాధపడేవారు. వాటిని నిరసిస్తూ సర్వసమత్వమును బోధించేవారు. అపారమైన ధనసంపదను ప్రోగుచేసిన వారిని లోకకంటకులైన అసురులు అని పేర్కొనేవారు. తమ శిష్యులలో ధనవంతులను అన్యాయముగా గాని, అవసరమునకు మించిగాని ధనార్జన చేయరాదని సూచించేవారు. రాజులకు, మహారాజులకు పన్నులు అధికముగా విధించి ప్రజలను పీడించరాదని, ప్రజల క్షేమములోనే వారి క్షేమము ఇమిడి ఉన్నదని బోధించేవారు. ప్రతివారు స్వార్థమును వీడి సంఘ శ్రేయస్సు కొరకు పాటుపడవలసినదిగా హితోపదేశము చేసేవారు.

శ్రీ ప్రకాశానంద స్వామి వారు సర్వసంగ పరిత్యాగి. కట్టు బట్టలు తప్ప ఏమీ దగ్గర ఉండేవి కాదు. ఎంత దూర ప్రయాణమైనా చేతిలో రూపాయి ఉండేదికాదు. ఎక్కడికి వెళ్ళినా స్మశానములోనో, పాడుబడిన దేవాలయములోనో, చెట్టుక్రిందనో ఉండేవారు. భక్తులు స్వామివారి కొరకు నివాసము, ఆశ్రమము నిర్మించవలెనని ఎంత ప్రయత్నము చేసినా స్వామి అంగీకరించలేదు. మోరబీ మహారాజావారు స్వామివారి శిష్యులు. ఒక పర్యాయము రాజావారికి జబ్బుచేసి అంత్యకాలము సమీపించినట్లు భావించి, స్వామివారి దర్శనముకోరి ఆర్తితో ప్రార్థించారు. స్వామివారు వెళ్ళి రాజా వారికి స్వస్థత కలిగి పూర్తిగా కోలుకొనే వరకు అక్కడే ఉన్నారు. స్వామి వారి అనుగ్రహమువలననే తాను కోలుకున్నాననే భావనతో రాజావారు అమితానంద భరితులై, స్వామి వారికి ధర్మ కార్యముల కొరకు లక్షరూపాయలు సమర్పించారు. స్వామి వారు ఆ ధనమును కండ్లతో చూడనైనా చూడకుండా, ఆ సంవత్సరము పంటలు పోయి కరువుతో బాధపడుతున్న రైతులకు సహాయముగా పన్ను భారము తగ్గించమని స్వామి సలహా యిచ్చారు. రాజావారు స్వామివారి ఆజ్ఞను శిరసావహించి రైతులు భూమిశిస్తు

కట్టనక్కరలేదని ఉత్తర్వులిచ్చారు. దీనివలన రాజావారికి వచ్చు ఆదాయములో సుమారు 20 లక్షల రూపాయల ఆదాయం వదులుకున్నారు.

శ్రీ ప్రకాశానంద స్వామి వారు “సత్పురుషుడు గర్వపడడు. ఇతరులను నిందించడు. ఎవరితోను కఠోరముగా మాట్లాడరు. అప్రియ వాక్యములు పలికినను క్రోధము పొందరు. ఇతరులయందు దోషములను చూపకుండా మూగవానివలె ఊరకుండును. తన దోషములను మాత్రము ప్రకటించును. విద్యావినయములు కల బ్రాహ్మణుడు, ఆవు, ఏనుగు, కుక్క, చండాలుడు - వీటి అన్నిటియందు సమానదృష్టి కలిగి ఉండువారు పండితులు. ఎల్లప్పుడు భావమునందు అద్వైతము కలిగిఉండవలెను. కాని క్రియాద్వైతము పనికిరాదు. ప్రతి ప్రాణియు భగవత్స్వరూపము. అందరి హృదయములయందు సర్వాంతర్యామియగు పరమాత్మ ఉన్నాడు. ఇట్టి అభేదభావము అద్వైతము అనబడును. కాని గురువుతో అద్వైతమును పొందరాదు. ఆయనకు నమస్కారము చేయవలెను” అని చెప్పేవారు.

శ్రీ స్వామివారు శంకరాచార్యుల వారి అద్వైతమునే ఆచరించి బోధించేవారు. అన్నిమతములకు గమ్యస్థానము ఒక్కటేనని, దానిని చేరు మార్గములు వేరని నమ్మి, ఆచరించి బోధించారు. అవకాశము లభించినప్పుడెల్ల చిన్న పెద్ద అని యెంచక సాధువులందరితోను వేదాంత గోష్టి జరిపేవారు. తరచుగా ఏకాంతములో ధ్యానమగ్నులై ఉండేవారు. ఆ సమయములో స్ఫురించిన విషయములను తరువాత ఒక చోట వ్రాసి ఉంచేవారు. అవన్నీ క్రోడికరించి “వార్తాలాపము” గ్రంథము తయారు చేశారు. ఈ వార్తాలాపము రచించినది శ్రీ ప్రకాశానంద స్వామివారే అయినను, తమకును శ్రీ నిత్యానంద స్వామివారికిని శిష్యుల సమక్షమున జరిగిన సంభాషణలు సేకరించి ఈ పుస్తకములో పొందుపరచబడినవి. ఈ స్వాములవారిద్దరి మధ్య జరిగిన వేదాంతచర్చ పుస్తక రూపములో హైందవ ప్రజానీకమునకు, ముముక్షు జనులకు, సంసార తరణోపాయమునకు ఉత్తమోత్తమ గ్రంథము. ఇందులో సులభము, సరళమైన శైలిలో సర్వసుబోధకముగా కథలు, దృష్టాంతములతో అనేక క్లిష్టమైన ఆధ్యాత్మిక విషయములు

నిరూపించబడినవి. ప్రతివ్యక్తి ఆత్మపరీక్ష చేసికొని తరించుటకు తగిన మార్గములు ఈ పుస్తకములో చూపబడినవి. శ్రీ స్వామివారు ద్వారక చేరుకుని శ్రీ తులసీదాసు గారి భవనములో నివాసమేర్పరుచుకొని వారి నిత్యకృత్యములను యథావిధిగా నిర్వర్తించుకొనుచూ మిగిలిన సమయమంతా జిజ్ఞాసువులకు తగిన సూచనలిచ్చుచూ, వచ్చిన వుత్తరములకు సమాధానములు ఇచ్చుచూ, ఇదివరలో వ్రాసిఉంచిన సాహిత్యమును పున:పరిశీలిస్తూ రోజులను సామాన్యముగా గడుపుచుండిరి. ఈ సమయములో శ్రీ తులసీదాసు గారి సోదరి శ్రీమతి మాధురిబెన్ స్వామివారి అవసరములను ఎరిగి తల్లి వలె సకల సపర్యలూ చేసినది. స్వామివారు కూడా ఆమెయందు పుత్రికా వాత్సల్యముతో సాధనా మార్గములను, ధ్యాన ప్రక్రియను సంపూర్ణముగా బోధించి మార్గ నిర్దేశం చేశారు. ఆమె స్వామివారినే దైవముగా భావించి సాధన చేసింది. శ్రీ స్వామివారు స్వల్ప అస్వస్థత అనంతరం ది.23.02.1962 శుక్రవారము రోజున బ్రహ్మీభూతులైనారు.

*మిస్టర్ గూడూరు ఆనంద్ బి.టెక్ గ్రాడ్యుయేట్ హాస్పిటల్ గ్రీన్ ఇనిషియేటివ్‌కు సహాయం చేస్తూ 10 డి.సి. ఫ్యాన్‌లను విరాళంగా ఇచ్చారు. శ్రీబాబూజీ మరియు మాతాజీ ఆ భక్తునికి ఉజ్జ్వల భవిష్యత్తు మరియు మరింత సేవ చేసుకునేలాగా ఆశీర్వదించాలని ప్రార్థిస్తున్నాము.*

## సమర్థ సద్గురు మాస పత్రిక సభ్యులకు విజ్ఞప్తి

ఈ క్రింద తెలిపిన సభ్యుల మాస పత్రిక చందా మార్చి, ఏప్రియల్ 2022 మాసాలలో ముగుస్తుంది. పత్రిక నిలిపివేసే ముందుగా మీ సభ్యత్వాన్ని పునరుద్ధరించుకొనండి.

***ఏప్రియల్ 2022 :*** AS 7460, 7464, 8023, 8697-8699, 8701-8718.. LM 4328, 4330

***మే 2022 :*** AS 8537, 8726

(గత సంచిక తరువాయి)

# నిరీక్షణ

తమిళ మూలం - శ్రీ ఆర్. సంపత్
తెలుగు అనువాదం - శశికళా దివాకర్

విశ్వామిత్రుడు రామునిరాక కొరకు కొద్దికాలము నిరీక్షించిన పిదప రామాగమము సమీపించు సమయమున అయోధ్యకు బయలుదేరారు. దశరథమహారాజు, ఆతనిని రాజమర్యాదలతో ఆహ్వానించి, స్వాగతం పలికి, పాదపూజ గావించి, వందనమొసగి, "మీరు మా రాజ్యానికి రావడం మా అదృష్టం, మీలాంటి గొప్ప మహర్షులు ఊరకనే రారు, కాబట్టి మీ కోరికేదైననూ నేను సంతోషంగా తీరుస్తాను" అని అన్నాడు. గొప్ప పరాక్రమశాలియైన దశరథుల వినయశీలతకు మెచ్చి, విశ్వామిత్రుడు, "దశరథా! నీ సామంత రాజులందరూ నీ కట్టడికి లొంగియున్నారా? దానధర్మాలు సక్రమంగా చేస్తున్నావా? మంత్రులందరూ నీకు సాచివ్యం చేస్తున్నారా?" అని పలు కుశల ప్రశ్నలు వేసి, "నాకు ఒక కోరిక ఉంది, నువ్వు తీర్చాలి" అన్నాడు.

విశ్వామిత్రుని కోరిక వాల్మీకి రామాయణమందలి ఈ క్రింది శ్లోకముద్వారా తెలుసుకొందాము .............

**అహం నియమం ఆతిష్ఠే సిద్ధ్యర్థం పురుషర్షభ।**
**తస్య విఘ్నకరౌ ద్రువౌ తు రాక్షసౌ కామ రూపినౌ॥**
**వ్రతే మే బహుశః చీర్ణే సమప్త్యాం రాక్షసావిమౌ।**
**మారీచః చ సుబాహుః చ వీర్యవంతౌ సిశ్శితౌ॥**
**తౌ మాంస రుధిర ఓఘేణ వేదిం తాం అభ్యవర్షతాం॥**
**అవధూతే తథా భూతే తస్మిన్ నియమ నిష్చయే।**
**కృత క్షమో నిరుత్సాహః తస్మాత్ దేశాత్ అపక్రమే॥**
**స్వ పుత్రం రాజ శార్దూల రామం సత్య పరాక్రమం।**
**కాక పక్ష ధరం శూరం జ్యేష్ఠం మే దాతుం అర్హసి॥**

("ఓ దశరథ మహాపురుషా! నేను నా ఆధ్యాత్మిక లక్ష్యం సాధించుటకై ఒక మహాయాగము తలపెట్టాను. దానికి ఇద్దరు రాక్షసులు మారు వేషములలో వచ్చి ఆటంకం కలిగిస్తున్నారు".

"ఆ నా యజ్ఞం ఆఖరి దశకు చేరుకుంది. మారీచుడు, సుబాహు అను గొప్ప పరాక్రమ, నైపుణ్యములు గల ఇద్దరు రాక్షసులు, వర్షం కురిసే రీతిలో రక్త, మాంసములను పడవేస్తూ ఆ యజ్ఞగుండ మందలి అగ్నిని ఆర్పే ప్రయత్నం చేస్తున్నారు.

నేను ప్రతిజ్ఞచేసి తలపెట్టిన ఆ నా యాగమునకు వారు భంగం కలిగించుచున్నప్పుడు నేను అక్కడి నుంచి అశక్తుడనై వైదొలగవలసి వస్తోంది.

దట్టమైన చెట్లతో నిండియుండు దండకారణ్యములో నేను తలపెట్టిన ఆ యాగమునకు ఆటంకము కలిగిస్తూ, మునులను భయమునకు గురిజేస్తూ, కామాగ్నిలో రగిలిపోవు విధమున ఘోరమైన రీతిలో ఆ రాక్షసులు మధ్యలో వస్తున్నారు. కాబట్టి నీ నలుగురు సుపుత్రులలో జ్యేష్టుడైనవాడు, శూరుడు, సత్యవంతుడు, పరాక్రమ శీలుడైన రాముని నాతో పంపవలయును".)

అలా తనను కోరిన విశ్వామిత్రుడు, దశరథునికి ఆ క్షణమున, ప్రాణములు గైకొను యమునివలె కనిపించాడు. విశ్వామిత్రుని మాటలచే తన హృదయములో రగిలించబడిన అగ్నినుండి వెలువడు నిప్పురవ్వలు తన చెవిలో పడిన భావనకు దశరథుడు గురయ్యాడు. ఎంతో ఘనంగా యాగమొనరించి పొందిన తన గారాల పుత్రుడు రామునికి గొప్ప ఆపద వచ్చిందేయని భీతిల్లి, విశ్వామిత్రుని గాంచి, "ఓ మహాత్మా! రాముడు చిన్న బాలుడు. అస్త్ర, శస్త్ర విద్యలేమియూ ఎరుగనివాడు. కావున ఆతడు వద్దు. రాక్షసులు ఆటంక పరచకుండా మీ యాగమును కాపాడుటయే మీరు కోరుచున్న విషయమైతే, రాక్షసులేమిటి? గంగను తన జటలలో బంధించిన శివుడు, బ్రహ్మ, ఇంద్రుడు మున్నగువారెవరొచ్చి ఆటంక పరచినా, వారిని అడ్డగించి మీరు యాగమును సక్రమముగా నిర్వహించుకొనుటకు నేను వచ్చి సహాయపడెదను. ఆ గొప్ప యాగమును ఆరంభించ వుపక్రమించండి" అన్నాడు దశరథ మహారాజు.

- సశేషం

# సమర్థ సద్గురునాథుని దివ్య చరిత్ర

## శ్రీ కొండ శేషంరాజుగారితో శ్రీబాబు

- కీ.శే. విజయేశ్వరానంద ప్రసాద్

శ్రీకృష్ణ పరమాత్ముడు లీలా మానుష విగ్రహుడు. అంటే మానవ రూపంతోనే అవతరించి, భగవంతునిదైన అతి మానుషత్వమును, దివ్యత్వమును సందర్భోచితంగా వెల్లడించిన వాడు. మానవులతో కలసి మెలసి సంచరిస్తూ, "ఇతడు మానవుడే" అనే ఆత్మీయతను పాదుకొలిపినవాడు. మధ్య మధ్యలో తన అవతార కార్యమైన 'లోక కళ్యాణ' ప్రణాళికలో భాగంగా, కొన్ని అతిమానుషమైన లీలలు చూపినవాడు. అందువలన తన తోటి మానవులలో "అమ్మో! ఇతడు మనతోనే కలిసి ఉన్నా, మన వలె కేవలం మానవ మాత్రుడు కాదు సుమా!" అనే హెచ్చరికను కలిగించి, తనయందు ఆ మానవులలో దైవ భావనను మొలకెత్తించినవాడు. అలా ఒక ప్రక్క ప్రేమాభిమానములను, మరొక ప్రక్క భక్తి ప్రపత్తులను కూడా వారిలో మేలుకొలుపుతూ, వారితో "అవినాభావ" సంబంధమును ఏర్పరుచుకొని, తనదైన రీతిలో ఆయా వ్యక్తులను మలచుకొని, తనవారిగా చేసుకొన్నవాడు.



నందకిశోరుని వ్రజ లీలలన్నీ యిందుకు ఉదాహరణలే. గోపికల యిళ్ళకు వెళ్ళినది "వెన్న దొంగిలించటానికే" అని నమ్మిస్తూనే , నిజానికి ఆ నల్లనయ్య వాళ్ళకే తెలియకుండా కొల్లగొట్టినది వాళ్ళ మనసులనే.

శ్రీ బాబు ఒక గ్లాసెడు మంచినీళ్ళకోసమో, మజ్జిగకోసమో వెళ్ళినట్లుగా భక్తుల యిళ్ళకు వెళ్ళి, ఆ భక్తుల హృదయాలనే గెలుచుకొని, తమవిగా చేసికొని పరిపాలించుకున్న తీరు సరిగా ఆ వ్రజ కిశోరుని తీరునే తలపిస్తుంది.

శ్రీ బాబు మొదటిసారిగా గుండుగొలను వచ్చినప్పుడు వారిని ముందుగా చైర్మన్ కొండ వెంకటరాజు గారు తమ యింటికి ఆహ్వానించారు. వెంటకరాజు గారి ఏకైక కుమారుడు శేషంరాజు గారు. వారు ఎలక్ట్రికల్ ఇంజనీరుగా పనిచేస్తూ ఉండేవారు. వారి ధర్మపత్ని

కృష్ణవేణమ్మగారు. వారిద్దరికి మొదట్లో శ్రీ బాబుతో పెద్దగా పరిచయం లేదు.

శేషంరాజుగారి తోడల్లుడైన శ్రీ బి.యస్. సుబ్బరాజుగారు ఏలూరులో నివసిస్తూ ఉండేవారు. వారు శ్రీ బాబు భక్తులు. హార్మోనియమ్ చాలా బాగా వాయించే వారు. హార్మోనియమ్ పై వారి సంకీర్తన, వారిని శ్రీ బాబుకు మరింత సన్నిహితులుగా చేసింది. శేషంరాజు గారి ప్రథమ పుత్రిక హేమ. సుబ్బరాజుగారి పిల్లలతో కలిసి చదువుకుంటూ ఏలూరులో ఉండేది.

శ్రీ బాబు ఒకసారి సుబ్బరాజుగారి యింటికి వచ్చినప్పుడు హేమను చూసి, "ఈ పాప ఆరోగ్యం సరిగా లేదు. చాల దోషమున్నది. తగిన చికిత్స త్వరలో జరగకపోతే అది ప్రాణాంతకంగా పరిణమిస్తుంది" అన్నారు. సుబ్బరాజు గారు శ్రీ బాబుతో "తమరు దయతో తగిన ఔషధమును ప్రసాదించండి" అని ప్రార్థించారు. శ్రీ బాబు "పాప తల్లి దండ్రులిద్దరూ నా వద్దకు వస్తే, వారితో మాట్లాడి అన్ని విషయాలూ తెలియజేస్తాను" అన్నారు. ఆ విషయం తెలిసి కృష్ణవేణమ్మ గారు హేమను శ్రీ బాబు వద్దకు తీసుకొని వెళ్ళారు. శేషంరాజు గారు వెళ్ళలేదు. అయినా శ్రీ బాబు హేమకు మందిచ్చారు. హేమ ఆరోగ్యం కుదుట పడింది. కృష్ణవేణమ్మగారికి శ్రీ బాబుపై గురి కుదిరింది.

- సశేషం



(గత సంచిక తరువాయి) **సత్సంగం** సేకరణ - భీమవరం గుప్తా

అలా కాకుండా వ్యర్థంగా కాలం గడుపుతూ, వ్యసనాలతో, ప్రతికూల భావం కలిగిన వారితో తిరిగేవాడు ప్రతి అంశాన్నీ ప్రతికూలంగానే చూస్తాడు. ఎవరినీ క్షమించలేడు, ఆదరించలేడు. సందేహాలతో జీవిస్తాడు. స్వార్థం కోసమే చూస్తాడు. కేవలం ధనార్జనే లక్ష్యంగా ఉన్న వారంతా ఆ సత్సంగాన్నీ, జీవన మాధుర్యాన్ని కోల్పోతారు.

రోజులో కొంతసేపైనా ఏ మంచి పుస్తకాన్నో వ్యక్తిత్వ నిర్మాణం చేసే వాటినో చదువుకోవాలి. ధర్మం కోసం స్వార్థాన్ని త్యాగం చేయగలిగే వ్యక్తిత్వ వికాసాన్నిచ్చే సంప్రదాయ గ్రంథాలనే అధ్యయనం చేయాలి. అలా వికసించిన వ్యక్తిత్వం ఎలాంటి సంఘటనాంశాన్నైనా ఎదుర్కోగలిగే పటుత్వాన్నిస్తుంది. గొప్ప వ్యక్తిత్వమున్న మహాత్ముల మాట విన్నా, వారితో మసలినా అవి కూడా మన ఆలోచనలపై, జీవిత దృక్పథంపై ప్రభావం చూపిస్తాయి. అందుకే మనం సర్వకాల సర్వావస్థలలోనూ ..

1. గొప్ప వ్యక్తిత్వాలతో,
2. గొప్ప గ్రంథాలతో,
3. గొప్ప ప్రసంగాలతో,
4. సాత్విక కళలతో
5. గురు బోధతో

'సత్సంగాన్ని' సాధిస్తూనే వుండాలి.

వనవాస సమయంలో మార్కండేయ, బృహదశ్వ, నారద, వ్యాసాది మహర్షుల సాంగత్యం లభించడం చేత ధర్మరాజు ధీరంగా, ధర్మబద్ధంగా దృఢంగా ఉండగలిగాడు, సత్కర్మానుష్ఠానంతో, సోమరితనం లేకుండా, ప్రతికూల ధోరణులు లేని విధంగా వ్యక్తిత్వాన్ని పదిలపరచుకున్నాడు. చివరగా విజయం ఆయన్నే వరించింది. ఇదే రీతి మన ధార్మిక గాథలన్నిటిలో గోచరిస్తుంది.

అశోక వనంలో సీతమ్మ నిరాశకులోనై నిరాసక్తతలో మునిగినప్పుడు మహాసత్పురుషుడైన హనుమరాక, ఆయన మాటలలోని ధార్మికత, సత్యదర్శనం, తత్త్వవివేచన, ధైర్యం బలాన్నిచ్చాయి.

ఓదార్పునిచ్చాయి. సమస్యనెదుర్కొనగలిగే స్థిమితాన్ని ప్రసాదించాయి. **'సత్సంగత్వేనిస్సంగత్వం'** అనే మాట ఆధ్యాత్మిక వాణియే కాదు నిత్య జీవననాదం కూడా. 'సత్సంగాన్నే సమకూర్చుకోవాలి' అంటూ నారదుడు - **'తదేవ సాధ్యతామ్'** అనే రెండు మార్లు నొక్కి చెప్పాడు. అంతేకాదు దుస్సంగాన్ని విడిచి పెట్టాలి అని స్ఫుటంగా బోధించాడు.

దుర్జన, దుర్విషయాలు, సాంగత్యాలు (దుస్సాంగత్యం) విడిచి పెట్టడం ప్రధాన సాధన. చెడును విడిచిపెడితే ఆ ప్రాంతంలో, ఆ కాలంలో - మరో మంచి విషయాన్ని వినడమో, చదవడమో, గ్రహించడమో చేయగలం. సత్సాంగత్యాన్ని సమకూర్చుకోవడంతో పాటు, దుస్సాంగత్యాన్ని కూడా వదులుకోమని గీతాచార్యుడే గీతలో సెలవిచ్చాడు. ఒక్కమంచి మాటతో మంచి బాటలోకి మలుపు తిరిగిన జీవితాలెన్నో! వాటిని గమనిస్తే జీవితం కంటే, గొప్ప అద్భుతం లేదని స్పష్టమౌతుంది!

అలాంటి వాతావరణం ఎక్కడ దొరుకుతుంది, అని అనుమానం రావచ్చు. సమర్థసద్గురువులయిన బాబుజీ మహరాజ్ వారు ప్రసాదించిన కాశీవనాశ్రమములో అవన్నీ లభించుతున్నాయి. ఇక్కడ ,తల్లి గర్భంలోనే రక్షింపబడుచున్న పరీక్షిత్తు లున్నారు. 'నమ్మకంతో గురుదేవుని ఆశ్రయించి, చెప్పినట్టు నడిచే జీవరాశులకు మరుజన్మలేదు' అని అభయమిచ్చారు, గురుమహరాజ్. ఇది భక్తులు ప్రత్యక్షంగా చూస్తున్నారు. జై గురుదేవ్.



(గత సంచిక తరువాయి)

## జనాబాయి

"భక్తి అనే గుడ్డను మెడలో వేసి పండరీనాథుని నిలబెట్టాను. నా హృదయాన్ని కారాగారంగా మార్చి అందులో విఠలుని బంధించాను. ప్రణవ నాదమనే గొలుసుతో పాండురంగని పాద పద్మాలను కట్టివేశాను. నిర్గుణ పరబ్రహ్మ స్థితిని పొందినా నాకు సగుణ రూపమే ఇష్టం. నా గోపాలుని అనంత ప్రేమలో కరిగి పోయాను" అని గానం చేసింది.



గుణాబాయి ఒకనాడు జానాబాయిని పిలిచి జొన్నల పిండిని విసరమని చెప్పింది. ఆ రాత్రి అందరు నిద్రపోయిన తరువాత పాండురంగని నామాన్ని ఆలపిస్తూ జొన్నలు తిరుగలిలో పోస్తూ విసురుతుంటే, తిరుగలిలో జొన్నలు పిండిగా మారుతుంటే, భగవన్నామం అనే తిరుగలిలో సంచిత కర్మలనే జొన్నలను తిప్పితే నామరూపాత్మకమైన ప్రపంచం అదృశ్యమై దివ్యచైతన్యమే అనుభూతి అవుతుంది అనే భావనతో పాడుతూ జొన్నలు విసురుతూ ఉంటే, జనాబాయి భావగర్భిత గానాన్ని విని పాండురంగడు ఆమెకు ప్రత్యక్షమయ్యాడు. ఆమెకు ఆధ్యాత్మిక విషయాలను తెలియజేశాడు . జనాబాయికి పిండి తయారుచేయటంలో ఆమెకు భగవానుడు సాయం చేశాడు.

బ్రహ్మముహూర్త సమయానికి పుండరీక వరదా! పాహిమాం! పాండురంగ విఠలా పాహిమాం! అని భక్తుల నినాదాలు చంద్రభాగా నదీతీరాన స్నానానంతరం చేస్తున్న నినాదాలు విన వస్తూంటే జనాబాయి "స్వామీ! భక్తులు మీ దర్శనార్థం ఆలయానికి వస్తున్నారు. తమరు వెళ్ళి భక్తులను కరుణించండి" అంది. పిండి విసురుతున్నప్పుడు తిరగలి ప్రక్కనే ఉంచిన అభరణాలను మరచి

జనాబాయి కప్పుకొనే బొంతను పైన వేసుకొని ఆలయంలో ప్రవేశించాడు పాండురంగడు.

ఆలయంలో అర్చకులు తలుపులు తెరవగానే స్వామి అభరణాలు, పీతాంబరము అదృశ్యమయి వాటి స్థానంలో చిరిగిన బొంత ఉంది. భక్తులలో ఒకరు ఆ బొంత జనాబాయిది అని గుర్తించాడు. పూజారులు కోపోద్రిక్తులయి, వారు న్యాయాధీశునికి ఫిర్యాదు చేసారు. అందరూ జనాబాయి ఇంటికి వెళ్ళి నిజమేమిటో చెప్పమంటారు. ఆమె నాకు ఏమీ తెలియదు అన్నది. ఇల్లు సోదా చేస్తే తిరుగలి సమీపంలో స్వామి ఆభరణాలు కనిపిస్తాయి. జనాబాయి ఆభరణాలు దొంగిలించినది అని ఆమెకు ఉరిశిక్ష విధించారు. నామదేవులవారు ఎంత వేడుకున్నా లాభం లేకపోయింది.

ఉరితీసే రోజు వచ్చింది. చంద్రభాగా నదీ తీరంలో సకల జనాలూ చూస్తుండగా ఉరితీయటానికి నిశ్చయించారు. ఆమెకు ఎఱ్ఱటి వస్త్రాలు ధరింపజేసారు. నడుముకు త్రాడు కట్టి లాక్కెళుతుంటే ఆమె పడిపోయింది. నిర్దాక్షిణ్యంగా ఆమెను ఈడుస్తుంటే శరీరమంతా రక్తసిక్తమైంది. ఆమెను ఉరికంబం ఎక్కించారు. కులతత్వాలతో కరడు కట్టినవారు "ఈ అధమ కులస్తురాలు భక్తురాలు అవటమా? ఈమెకు తగిన శిక్ష ఇదే" అని సంతోషిస్తున్నారు.

జనాబాయి అంతిమ క్షణంలో చేతులు జోడించి "హే పాండురంగా! నిజానిజాలు నీకు తెలుసు. నేను చేయని దొంగతనానికి ఉరి శిక్ష పడుతోంది. తమ దర్శన భాగ్యమే మహాప్రసాదం అనుకున్నాను. నేను పనులు చేస్తూ ఉండటం చూసి నువ్వే నాకు సహాయం చేశావు కదా! మరి ఈ ఘోరాన్ని ఆపలేవా! మృత్యువు అంటే నాకు భయంలేదు. అది నన్ను శాశ్వతంగా నీ పాద సన్నిధికి చేర్చుతుంది" అని ప్రార్థించింది.

- సశేషం

Printed, and Published by C.V. Ramana Babu, on behalf of YOGINI SRI CHANDRA KALI PRASADA MATHAJI CHARITABLE TRUST and Printed at Samardha Sadguru Publications, D.No. 3-499, Sri Kali Gardens Ashram, Nambur - 522508, Guntur Dist., Andhra Pradesh, and published at D.No. 3-499, Sri Kali Gardens Ashram, Nambur - 522508, Guntur Dist., Andhra Pradesh. Editor - PALURI SIVA RAMA KALI PRASAD







శ్రీకాళీవనాశ్రమ హైదరాబాదు
శాఖ యందు జరిగిన
భోగిపండుగనాటి దృశ్యములు

Regd. News Magazine Periodical
Posted on 5th and 6th of every month

RNI No. 37804/81
Postal Regd. No.: GTR/27/2021-2023



శ్రీ కాళీవనాశ్రమ గుండుగొలను శాఖయందు సద్గురుమూర్తికి
భోగిపళ్ళు పోస్తున్న భక్తులు



శ్రీ కాళీవనాశ్రమ పెదనింద్రకొలను శాఖలో
భోగిపండుగనాటి శ్రీ సద్గురు పాదపూజా దృశ్యం

*If undelivered please return to*
**SAMARDHA SADGURU**
SRI KALI GARDENS
Ashramam-522 508, Guntur Dist., A.P.